teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 398 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 11 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## గ్రూప్-4 పోస్టుల ధ్రువపత్రాల పరిశీలనకు తేదీ ఖరారు

**ఈనెల 13వ నుండి వెబ్ ఆప్షన్స్ అవకాశం**

**తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్**




తెలంగాణ బ్యూరో, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ ప్రక్రియలో కీలకమైన ధ్రువపత్రాల పరిశీలనకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్పీఎస్సీ) తేదీని ఖరారు చేసింది. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునేందుకు కమిషన్ అధికారులు అవకాశం కల్పించారు. ధ్రువపత్రాల

మిగతా 2 లో



## త్వరలో కొత్త తెల్ల రేషన్ కార్డులు

**కేబినెట్ మీటింగ్‌లో రూపొందించిబడిన విధి విధానాలు**

**3నెలల తర్వాత పంపిణీ చేయనున్న సన్నబియ్యం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

సూర్యాపేట, జూన్ 10 (తీన్మార్ న్యూస్): రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభవార్త చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరికీ త్వరలో కొత్త తెల్ల రేషన్ కార్డులు అందిస్తామన్నారు. కార్డులను మంజూరుకు సంబంధించి ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో విధి విధానాలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. కార్డు దారులందరికీ 3నెలల తర్వాత సన్నబియ్యం పంపిణీ

మిగతా 2 లో




# ధరణిలో దరఖాస్తుల పెండింగ్

## ఎన్నికల కోడ్ నిబంధనతో మరింత పెండింగ్

**పరిష్కార ప్రత్యేక డ్రైవ్ అ"లక్ష్యం"కు ఎన్నికల కోడ్ ఓ కారణమే**

సమస్యలపై దృష్టి పెట్టిన రెవిన్యూ శాఖ

దరఖాస్తు చేసేందుకు ముందుకు వస్తున్న రైతులు




తెలంగాణ బ్యూరో, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో చాలా వరకు ఏంతో కాలంగా భూ సమస్యలు పెండింగ్లో ఉన్నాయి. ధరణిలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం మార్చిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పెండింగ్‌లో ఉన్న 2.46 లక్షల దరఖాస్తులను జూన్ 4లోపు పరిష్కరించాలని ఒక లక్ష్యం నిర్దేశించింది. అయితే పరిష్కార ప్రక్రియలో వేగం తగ్గడమేగాక లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో డ్రైవ్‌ను రెవెన్యూ శాఖ నిలిపివేయడంతో సుమారు

మిగతా 2 లో

## పూర్తిస్థాయి బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్

**అన్ని శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ రివ్యూ**



**లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు ఆర్థిక శాఖ అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలపై వివరాలు తెప్పించుకుంటూ రివ్యూలు చేస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం 4 నెలల కోసమే పెట్టుకున్నారు. జులై నెలలో ఓటాన్ అకౌంట్ ముగుస్తుంది. దీంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది.**

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ కూడా పూర్తవడంతో త్వరలో పార్లమెంట్‌లో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను పెట్టేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. కేంద్ర బడ్జెట్ ఈ జూన్‌లో ప్రవేశపెడితే జులై మొదటి వారంలో రాష్ట్ర బడ్జెట్‌ను పెట్టేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల నుంచి రాష్ట్ర ఆదాయం ఎలా ఉంది? ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలల సగటు రాబడిపై లెక్కలు

మిగతా 2 లో



## సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసివేయొద్దు

**అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**గత ప్రభుత్వం విధానంపై మండిపడ్డ సీఎం**

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు రావట్లేదని సింగిల్ టీచర్ ఉన్న

మిగతా 2 లో

## గొర్రెల స్కామ్ దర్యాప్తును వేగవంతం చేసిన ఏసీబీ

**నిందితులను కస్టడీలోకి తీసుకుని ఏసీబీ విచారణ**

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గొర్రెల స్కామ్ దర్యాప్తులో ఏసీబీ అధికారులు స్పీడ్ పెంచారు. నిందితులను ఏసీబీ కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం మాజీ పశు






## విద్యాకమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

**విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం**

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన**

రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రోత్సహించడంతోపాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు విద్యాకమిషన్ ఏర్పాటు చేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నిరంతరం పనిచేసే వ్యవస్థగా విద్యాకమిషన్ ను తీర్చిదిద్దబోతున్నామని అన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో చదివి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సోమవారం రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన వారితో ఆ పాఠశాల యాజమాన్యలు ఫొటోలు దిగి తమ విద్యార్థులని చెప్పుకొంటారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10 జీపీఏ సాధించిన విద్యార్థులంతా మా పిల్లలేనని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని

మిగతా 2 లో

## టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నుండి ఉపశమనం

**శాటిలైట్ ఆధారిత టోల్ సేకరణకు కేంద్రం అడుగులు**

**రెండేళ్లలో టోల్ పాయింట్ల వద్ద గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్**



న్యూ ఢిల్లీ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): దేశంలో శాటిలైట్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణను ప్రారంభించాలని భారత ప్రభుత్వం యోచిస్తోంది. ముందుగా వాణిజ్య వాహనాలకు దీన్ని అమలు చేయనున్నారు. దీని తరువాత, ఈ సాంకేతికత ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్‌లకు కూడా

మిగతా 2 లో



## కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టి

2

- విద్య, వైద్యం, వసతుల కల్పనపై ప్రధానంగా ఫోకస్
- కార్మికుల శ్రేయస్సు కోసం కొత్త ప్రపోజల్స్ సిద్ధం
- స్కూళ్ల ఆధునీకరణతోపాటు సీబీఎస్ఈ సిలబస్
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌గా ఆరు ఏరియాల్లోని హాస్పిటల్స్

## కాళేశ్వరం అవకతవకలపై చంద్ర ఘోష్ కమిటీ విచారణ



2

- కమిటీకి ఈ ప్రాజెక్ట్‌పై 54 ఫిర్యాదులు
- 18 మంది విచారణకు రావాలని నోటీసులు జారీ

## 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదల

**ప్రయోజనం పొందనున్న 9కోట్ల 30 లక్షల మంది రైతులు**

న్యూ ఢిల్లీ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడతను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి యొక్క 17వ విడత విడుదలకు

మిగతా 2 లో



## సుప్రీంకోర్టుకు చేరిన నీట్ పరీక్ష అవకతవకల వివాదం

**హైకోర్టులో 12వ తేదీన విచారణ**

**పరీక్షను మళ్లీ నిర్వహించాలని అభ్యర్థుల డిమాండ్**

న్యూ ఢిల్లీ, జూన్ 10 (తీన్మార్ న్యూస్): నీట్ పరీక్షల్లో తలెత్తిన అవకతవకల వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. నీట్ పరీక్షలో గ్రేస్ మార్కులు ఇవ్వాలన్న ఎన్టీఏ నిర్ణయానికి వ్యతిరేకంగా తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలవ్వగా, ఇప్పుడు సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ దాఖలైంది. 1,563 మంది

మిగతా 2 లో






## వికారాబాద్ అడవిలో భారత నౌకాదళం

**ఏర్పాటుకానున్న వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్**

వికారాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): వికారాబాద్ అడవిలో భారత నౌకాదళం దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్‌ను ఏర్పాటు

మిగతా 2 లో

# ధరణిలో దరఖాస్తుల పెండింగ్

మొదటి పేజీ తరువాయి



లక్ష దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తయింది. వీటికి పాసు పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది. మిగతావి ఎన్నికల కోడ్, ఎన్నికల విధులలతో పూర్తి కాకుండా అలానే ఉన్నాయి. కాగా పరిష్కారం కానీ సుమారు మరో 1.46 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు ముగిసి కోడ్ తొలగిపోయే లోపు వివిధ సమస్యలకు సంబంధించి ధరణిలో మరో 60 వేల దరఖాస్తులు రావడంతో పెండింగ్ దరఖాస్తుల సంఖ్య మళ్లీ సుమారు 2.06 లక్షలకు చేరుకుంది. రైతులు గత ఏడాది అక్టోబరుకు ముందు ధరణి పోర్టల్‌లో చేసుకున్న దరఖాస్తులను కొన్ని జిల్లాల కలెక్టర్లు ఎడాపెడా తిరస్కరించింది. ఇప్పుడు రెవెన్యూ శాఖ అన్ని సమస్యలపై దృష్టి పెడుతుండటంతో రైతులు తిరిగి దరఖాస్తు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

# గొర్రెల స్కామ్ దర్యాప్తును వేగవంతం చేసిన ఏసీబీ

మొదటి పేజీ తరువాయి

సంవర్ధక శాఖ ఎండీ రాంచందర్ నాయక్, తలసాని ఓఎస్డీ కళ్యాణ్ లను కస్టడీకి తీసుకున్నారు. కాగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న పశు సంవర్ధక శాఖ మాజీ ఎండీ రామ్ చందర్ నాయక్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కళ్యాణ్ కుమార్‌లను మూడు రోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో ఏసీబీ అధికారులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు రామ్ చందర్ నాయక్, కళ్యాణ్‌లను కస్టడీ విచారణ చేయనున్నారు. గొర్రెల స్కామ్‌లో ఇప్పటికే 10 మందిని నిందితులుగా గుర్తించి పలువురిని అరెస్ట్ చేశారు. గొర్రెల స్కామ్‌లో మొదట రూ. 2.10 కోట్లు దారి మళ్లినట్టు గుర్తించారు. పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామ్ చందర్ నాయక్ , ఓఎస్డీ కళ్యాణ్ అరెస్ట్‌తో రూ.700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. దీనికి సంబంధించి కీలక ఆధారాలు సేకరించింది. కస్టడీ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ మోహినూద్దిన్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# త్వరలో కొత్త తెల్ల రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

చేస్తాం. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం అని స్పష్టం చేశారు.

**అందరికీ అందుబాటులోకి తీసుకొస్తాం**

ఈ మేరకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో రోడ్లు, భవనాలు, పంచాయతీ, విద్యుత్‌శాఖ ఆఫీసర్లతో ఉత్తమ్ కుమార్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. అలాగే మంత్రిగా పనిచేసిన టైంలో హుజూ-ర్‌నగర్ నియోజకవర్గంలో 35, కోదాడ నియోజకవర్గంలో16 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ప్రారంభించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం అవి సరిగా పనిచేయడం లేదని, లిఫ్ట్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే విషయంపై చర్చించేందుకు సోమవారం కోదాడలో ఇరిగేషన్ ఆఫీసర్లతో మీటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. లిఫ్ట్‌ల రిపేర్లకు కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తాం. కోదాడ నియోజకవర్గంలోని సాగర్ లెఫ్ట్ కెనాల్ పైన ఉన్న లిఫ్ట్‌ల మెయింటెనెన్స్‌ను ప్రభుత్వమే చూస్తుందని 2014లో ప్రకటించిన కేసీఆర్ తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. లిఫ్ట్ మెయింటెనెన్స్‌కోసం ప్రతి 4లిఫ్ట్‌లకు ఆపరేటర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించి, వారికి ట్రైనింగ్ ఇస్తాం. ప్రాజెక్టుల వద్ద 24 గంటల సెక్యూరిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

# సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసివేయొద్దు

మొదటి పేజీ తరువాయి

పాఠశాలలను మూసివేయొద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్కార్ పాఠశాలలను సరిగా పట్టించుకోలేదని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఉద్ఘాటించారు. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2వేల కోట్లతో పనులు ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం నిర్వహిస్తోందని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి భేషజాలు లేవు.. ఎవరైనా సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు.

# కాళేశ్వరం అవకతవకలపై చంద్ర ఘోష్ కమిటీ విచారణ

హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలపై చంద్ర ఘోష్ కమిటీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ విచారణను వేగవంతం చేసింది. ప్రాజెక్ట్‌ను ఇప్పటికే చంద్ర ఘోష్ కమిటీ సందర్శించింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు కీలక విషయాలపై ఈ కమిటీ దృష్టి సారించింది. కమిటీకి ఈ ప్రాజెక్ట్‌పై పలు ఫిర్యాదులు అందడంతో విచారణను ముమ్మరం చేసింది, విచారణకు సంబంధించిన పలు విషయాలను సోమవారం మీడియాకు కాళేశ్వరం కమిషన్ చీఫ్ చంద్ర ఘోష్ వెల్లడించారు. విచారణ వేగవంతం చేసినట్లు తెలిపారు. సోమవారం 7 మందికి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చామని అన్నారు. మంగళవారం 18 మంది విచారణకు రావాలని నోటీసులు ఇచ్చామని చెప్పారు. మొన్నటి వరకు తెలంగాణలో ఎలక్షన్ కోడ్ ఉందని.. అందుకే కొంత ఆలస్యం అవుతుందని అన్నారు. అన్ని విషయాలు రానున్న రోజుల్లో బయటకు వస్తాయని స్పష్టం చేశారు. విచారణకు వచ్చే అధికారులకు నోటీస్ ఇచ్చామన్నారు. ప్రాజెక్ట్ అవకతవకలపై 54 ఫిర్యాదులు వచ్చాయని విచారణ ముమ్మరం చేస్తామన్నారు. ఫిర్యాదులో నష్టపరిహారానికి సంబంధించినవి కూడా వచ్చాయని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌కు కట్టిన ఏజెన్సీలను విచారణకు రావాలని నోటీసులు జారీ చేశామని అన్నారు. నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్దా ఉన్న సమాచారం తీసుకుంటున్నామని తెలిపారు. జూన్ 30వ తేదీ లోపు విచారణ పూర్తి కాదని ఇంకా సమయం పడుతుందని చెప్పారు. విచారణ వేగంగా జరుగుతుందని స్పష్టం చేశారు. అసలు విషయాలు, నిజాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేనని అన్నారు. టెక్నికల్ అంశాల విచారణ పూర్తి అయ్యాక, రెగ్యూలర్, ఆర్థిక, అంశాలపై విచారణ మొదలు అవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి రిపోర్టులు అన్ని అందాయని వాటి పరిశీలన జరుగుతుందని చంద్ర ఘోష్ పేర్కొన్నారు.

# 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదల

మొదటి పేజీ తరువాయి

అధికారం ఇచ్చే మొదటి ఫైల్‌పై మోదీ సంతకం చేశారు. దీని వల్ల దాదాపు ఇరవై వేల కోట్ల రూపాయల పంపిణీ ద్వారా తొమ్మిది కోట్ల 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. కొత్త ప్రభుత్వం తీసుకున్న తొలి నిర్ణయం రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తోందని మోదీ అన్నారు. రానున్న కాలంలో తమ ప్రభుత్వం రైతులకు, వ్యవసాయ రంగానికి మరింత కృషి చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పీఎం-కిసాన్ స్కీమ్ 2019లో దేశంలోని అన్ని భూస్వాముల రైతు కుటుంబాలకు ఆదాయ మద్దతునిచ్చే లక్ష్యంతో ప్రారంభించబడింది. ఈ పథకం కింద అర్హులైన రైతుల కుటుంబానికి ఏడాదికి ఆరు వేల రూపాయల ఆర్థిక ప్రయోజనం అందజేస్తారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 100 శాతం ఆర్థిక సహకారంతో సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌గా అమలు చేస్తోంది. మూడు విడతలుగా రెండు వేల రూపాయల చొప్పున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తున్నారు. ఈ పథకం 11 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చింది మరియు ఇప్పటి వరకు వారి ఖాతాలో మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా బదిలీ చేయబడింది.

# పూర్తిస్థాయి బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్



మొదటి పేజీ తరువాయి

తీస్తోంది. ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్న వివరాలు కూడా సేకరిస్తోంది. ఆరు గ్యారంటీలు, హామీల అమలుకు ఎంత ఖర్చు అవుతుందనే లెక్కలు కూడా వేస్తోంది. రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు అవసరం కాగా, వాటిని ఎలా సర్దుబాటు చేయాలనే దానిపైనా ఆర్థిక శాఖ చర్చిస్తోంది. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎడ్యుకేషన్‌కు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూ.2.76 లక్షల కోట్లతో పెట్టగా ఈసారి ఫుల్‌బడ్జెట్ అంతకు మించి ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఆదాయమెంత ఖర్చు ఎంత?**

వాస్తవ బడ్జెట్టే పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అసలు ప్రతి నెలా రాష్ట్ర ఆదాయం ఎంత? ఖర్చు ఎంత? అనే లెక్కలను అధికారులు తీస్తున్నారు. ఆదాయంలో జీఎస్టీ, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, సేల్స్ ట్యాక్స్ వంటివి ప్రధానంగా ఉన్నాయి. ఇవి కాకుండా ప్రతి నెలా ఆర్బీఐ నుంచి యావరేజ్‌గా రూ.4 వేల కోట్ల అప్పు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ అండ్ కంట్రిబ్యూషన్, కేంద్రం నుంచి రాష్ట్ర పన్నుల వాటా వంటివి వస్తాయి. ఇవన్నీ కలిపి ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.15 వేల కోట్లు వచ్చాయి. ఎన్నికలు కావడంతో కొన్నింటిపై ఆదాయ ప్రభావం చూపినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో యావరేజ్ రాష్ట్ర రాబడి నెలకు కనీసం రూ.20 వేల కోట్లు ఉండేలా టార్గెట్ పెట్టుకుంటున్నట్లు తెలిసింది. నాన్ ట్యాక్స్ రెవెన్యూపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ల్యాండ్ లీజులు, సేల్స్, మైనింగ్ ఆదాయం పెంచడం వంటి వాటి ద్వారా మరింత ఆదాయం రాబట్టుకోవాలని చూస్తున్నది. నాన్ ట్యాక్స్ రెవెన్యూ ఈ ఆర్థిక సంవత్సరంలో మినిమమ్ రూ.25 వేల కోట్లు తెచ్చుకోవాలని భావిస్తున్నది.

**అప్పులు, జీతాలకే ఎక్కువ**

మరోవైపు, రాష్ట్ర ఆదాయంలో సింహభాగం అప్పులు, జీతాల చెల్లింపులకే పోతున్నట్లు ఆర్థిక శాఖ రివ్యూల్లో తేలింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు కిస్తీలు, వడ్డీలకే యావరేజ్‌గా రోజుకు రూ.207 కోట్లు చెల్లిస్తున్నారు. దీంతో స్కీములకు, ఇతరత్రా వాటికి నిధుల సర్దుబాటుకు ప్రస్తుత సర్కార్ తిప్పలు పడుతోంది. ప్రతి నెలా కిస్తీలు, వడ్డీలకే రూ.6 వేల కోట్లకుపైగా చెల్లిస్తున్నట్టు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పులకు కాంగ్రెస్ సర్కార్ ఆరు నెలల్లోనే రూ.30 వేల కోట్లపైనే రీపేమెంట్లు (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు) చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ వస్తే ప్రభుత్వ ఖజానాలో రూ.12 వేల కోట్లు కచ్చితంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కిస్తీలు, వడ్డీల చెల్లింపులతో పాటు ఇందులో నుంచే జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు రూ.4,600 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇతర అత్యవసర ఖర్చులు తీసేస్తే ప్రభుత్వ పథకాలు, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లులకు కూడా కొంత మొత్తం చెల్లించి క్లియర్ చేయాల్సి ఉంది. దీంతో చెల్లింపుల లెక్కలను కూడా అధికారులు పక్కాగా తీసుకుంటున్నారు. దానికి అనుగుణంగానే స్కీములకు నిధుల కేటాయింపుపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

**గ్యారంటీలు, హామీలకు పూర్తి నిధులు**

ఫుల్ బడ్జెట్‌లో గ్యారంటీలు, హామీలకు సరిపడా నిధులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మొత్తం రూ.2,75,891 కోట్లు పెట్టగా అందులో ఆరు గ్యారంటీల అమలుకు రూ.53,196 కోట్లు కేటాయించింది. పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం హామీల అమలుకు పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయనుంది. ఇప్పటికే కొన్నింటికి విధివిధానాలు రూపొందించుకుని అమలు చేస్తుండటంతో ఏ గ్యారంటీకి ఎంత అవుతుందనే దానిపై ప్రభుత్వానికి ఓ క్లారిటీ వచ్చింది. యువ వికాసంలో భాగంగా ప్రతి మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు ఇవ్వనున్నారు. పెంచిన పెన్షన్లు ఇచ్చేలా చేయూత కింద నిధులు పెంచనున్నారు. వృద్ధులు, గీత కార్మికులు, డయాలిసిస్, పైలేరియా, ఎయిడ్స్ బాధితులు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత కార్మికులకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను అందించాల్సి ఉంది. వీటన్నింటికీ సరిపడేలా నిధుల కేటాయింపులు చేస్తున్నారు.

# విద్యాకమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీ, ఏపీకి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు ,తాను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లమేనని అన్నారు. తమకు చదువులు చెప్పిన గురువులదే ఈ ఘనత అని అన్నారు. సర్కారు బడుల్లో సమస్యలు ఎలా ఉంటాయో తనకు తెలుసునని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహిస్తే బాగుండేదని, వందేమాతరం ఫౌండేషన్ నిర్వహించి తమ ప్రభుత్వానికి బాధ్యతను గుర్తు చేసిందని సీఎం అన్నారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ లుగా పనిచేస్తున్న వారిలో 90% సర్కారు బడుల్లో చదివిన వాళ్లేనని అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు మూయడానికి వీల్లేదని తాను చెప్పానని సీఎం తెలిపారు. గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఏకోపాధ్యాయ పాఠశాలలను రన్ చేస్తామని చెప్పారు. ఎన్ని సమస్యలు వచ్చిన నడుపుతామని అన్నారు. ఇందుకోసం మెగా డీఎస్సీ వేసి 11 వేల పైచిలుకు టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. మనం విద్యపై పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్తుకు పెట్టుబడి అని అన్నారు. సర్కారు బడిలో చదివే ఒక్కో విద్యార్థిపై ఏటా ప్రభుత్వం రూ. 80 వేలు ఖర్చు చేస్తోందని అధికారులు చెబుతున్నారని, తనకు తెలిసి అవన్నీ టీచర్ల జీతాలని అనుకుంటున్నానని అన్నారు. మౌలిక వసతులపై గత ప్రభుత్వం దృష్టి తక్కువగా పెట్టిందని, దాంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.

అందుకే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను అమ్మ కమిటీలకు అప్పగించామని, గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలే మధ్యాహ్న భోజనం, యూనిఫారాల తయారీ ప్రక్రియను చేపడతాయని చెప్పారు. ఇందుకోసం గ్రీన్ చానల్ ద్వారా విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించినట్టు సీఎం చెప్పారు. సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడం ద్వార సత్ఫలితాలు వస్తాయని వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి చెప్పారని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చి పాఠశాలలో చదివించే ఈ ప్రక్రియను అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువు కారణంగా విద్యార్థులకు తల్లిదండ్రులతో అనుబంధం తగ్గుతోందని ఓ నివేదిక తెలిపిందని, కుటుంబ సంబంధాలు బలహీన పడొద్దని సీఎం పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 20వ తారీఖు వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలోవిద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టి

తెలంగాణ బ్యూరో, జూన్ 10 (తీన్మార్ న్యూస్): సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టింది. వెల్‌ఫేర్‌లో భాగంగా కార్మికులకు, వారి కుటుంబాలకు విద్య, వైద్యం, వసతుల కల్పనపై ప్రధానంగా ఫోకస్ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కార్మికుల శ్రేయస్సు కోసం కొత్త ప్రపోజల్స్ సిద్ధం చేస్తున్నది. ఇప్పటికే ప్రమాదంలో గాయపడిన, మృతిచెందిన కార్మికులను, వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.కోటి ప్రత్యేక బీమా సదుపాయాన్ని కల్పించగా మరిన్ని సౌలతులు కల్పించేందుకు రెడీ అవుతున్నది.

**ఇక అన్ని సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ**

కార్మికుల పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన చదువులు అందించాలని కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో కార్మికుల పిల్లల కోసం నిర్వహిస్తున్న స్కూళ్లను ఆధునీకరించాలని నిర్ణయించింది. ఢిల్లీలో గవర్నమెంట్‌స్కూళ్ల తరహాలో సింగరేణి సూళ్లను డిజిటలీకరణ చేయాలని సంకల్పించారు. అదే విధంగా ఇప్పటి వరకు కొనసాగుతున్న స్టేట్ సిలబస్ స్థానంలో సీబీఎస్ఈ సిలబస్‌కు అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజీలను, ఇంజినీరింగ్ కాలేజీలను ఆధునీకరించాలని యోచిస్తున్నారు.

**మోడ్రన్ క్వార్టర్స్‌గా అభివృద్ధి**

దశాబ్ధాల కాలంగా ఉన్న కార్మికుల పాత క్వార్టర్స్‌అన్నింటినీ ఆధునీకరించాలని సింగరేణి యాజమాన్యం యోచిస్తోంది. ఇప్పటి వరకు ఆఫీసర్లకు మాత్రమే మోడ్రన్ క్వార్టర్స్ సదుపాయం కల్పించగా, ఇక నుంచి కార్మికుల క్వార్టర్స్‌ను కూడా అప్‌గ్రేడ్ చేయాలని అనుకుంటోంది. సింగరేణి ఆరు ఏరియాల పరిధిలో ఇప్పటివరకు 42వేలకు పైగా కార్మికులున్నారు. ఈ కార్మిక కుటుంబాలు చాలా వరకు పాత క్వార్టర్స్‌లోనే ఉంటున్నాయి. కొన్ని చోట్ల క్వార్టర్ల నిర్వహణ సరిగ్గా లేక పాములు వస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో అయితే కార్మికులు చాలా తిప్పలు పడుతున్నారు. వీటిని అధిగమించి కార్మికుల స్థితిని మెరుగుపర్చాలని యాజమాన్యం నిర్ణయించింది. పాత క్వార్టర్స్ తొలగించి వాటి స్థానంలో మోడ్రన్ డిజైన్‌తో నిర్మించాలని నిశ్చయించింది. సంస్కరణల్లో భాగంగా కొత్త పంథాలో ముందుకు సాగాలని సింగరేణి యోచిస్తోంది.

**సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌గా అప్‌గ్రేడ్**

సింగరేణిలోని ఆరు ఏరియాల్లోని హాస్పిటల్స్‌ను సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దాలని సింగరేణి భావిస్తోంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న కొత్తగూడెం, రామగుండంతో పాటు పలు ఏరియాల్లోని హాస్పిటల్స్‌ను అప్‌గ్రేడ్ చేయాలని యోచిస్తోంది. ఇంతవరకు సింగరేణి దవాఖానల్లో సాధారణ వైద్యమే చేస్తుండగా అత్యాధునిక వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌తో పాటు, ప్రైవేటు కార్పొరేట్‌హాస్పిటల్స్‌కు పంపేవారు. అయితే, ఇక నుంచి పూర్తిస్థాయిలో గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, ఆర్థోపెడిక్ తదితర స్పెషలైజేషన్స్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చి సూపర్‌స్పెషాలిటీ సేవలు అందించనున్నారు.

# శుభాకాంక్షలు తెలిపేందుకు వస్తున్న వారికి కీలక విజ్ఞప్తి

- పూలబోకేలు, శాలువాలు స్వీట్లు తీసుకురావొద్దు
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్ లు తీసుకురావాలంటూ పిలుపు
- నా వినమ్ర పూర్వకమైన అభ్యర్థన: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 10 (తీన్మార్ న్యూస్): కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్ రెడ్డి తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వస్తున్న వారికి కీలక విజ్ఞప్తి చేశారు. నన్ను కలవడానికి వచ్చే మిత్రులు, శ్రేయోభిలాషులందరు దయచేసి పూలబోకేలు, శాలువాలు స్వీట్లు తీసుకురావొద్దు. ఇది నా వినమ్ర పూర్వకమైన అభ్యర్థన. వీటికి బదులుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్ లు లేదా స్ఫూర్తిదాయకమైన కథల పుస్తకాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా ద్వారా ఈ విజ్ఞప్తిని చేశారు. కిషన్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. గ్రేట్ డెసిషన్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా మోడీ3.0 కేబినెట్లో కిషన్ రెడ్డి మంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలోనూ ఆయన మంత్రిగా సేవలందించారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే.

# టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నుండి ఉపశమనం

మొదటి పేజీ తరువాయి

దశలవారీగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది కేంద్రం. రాబోయే రెండేళ్లలో అన్ని టోల్ కలెక్షన్ పాయింట్ల వద్ద ఈ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ని ఇన్‌స్టాల్ చేయడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి. దీంతో ఫాస్టాగ్ సేవలు ముగియనున్నాయి. కొత్త టెక్నాలజీ కారణంగా టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ నుండి ఉపశమనం ఉంటుంది. ఈ టెక్నాలజీ కింద వినియోగదారుడు తాను ప్రయాణించాల్సిన దూరాన్ని బట్టి టోల్ చెల్లించాల్సి ఉంటుంది. జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వ్యవస్థ అవరోధ రహిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణగా ఉంటుంది. దీనిలో వాహనం ప్రయాణించిన కిలోమీటర్ల సంఖ్యను గుర్తించడానికి వాహనం కదలికను ట్రాక్ చేయబడుతుంది.

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, భారతదేశంలో జీఎన్ఎస్ఎస్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ సేకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రపంచ కంపెనీలను ఆహ్వానించింది. ప్రతి టోల్ ప్లాజాలో జీఎన్ఎస్ఎస్ వాహనాలను గుర్తించడానికి ముందస్తు రీడర్‌లతో రెండు లేదా అంతకంటే ఎక్కువ లేన్‌లు ఉంటాయి. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) లేన్‌లోకి ప్రవేశించే జీఎన్ఎస్ఎస్ కాని వాహనాలకు అదనపు ఛార్జీ విధిస్తారు. మొదటి మూడు నెలల్లో 2,000 కి.మీ జాతీయ రహదారులపై జిఎన్ఎస్ఎస్ ఆధారిత టోలింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీని తర్వాత, వచ్చే తొమ్మిది నెలల్లో 10,000 కి.మీలకు, 25,000 కి.మీ టోల్ హైవేలకు, 15 నెలల్లో 50,000 కి.మీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఫాస్టాగ్ వ్యవస్థ ఉంది. ఇందులో ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీని ఉపయోగించారు. ఇది 2015లో ఫాస్టాగ్ రూపంలో ప్రవేశపెట్టారు.

**నితిన్ గడ్కరీ గ్రీన్ సిగ్నల్:**

కొన్ని రోజుల క్రితం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ కొన్నిసార్లు ప్రజలు టోల్ ప్లాజాల వద్ద పొడవైన క్యూలలో ఇరుక్కుపోతారని, చాలాసేపు వేచి ఉండవలసి ఉంటుందని చెప్పారు. దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కొత్త మార్గాన్ని కనిపెట్టింది. శాటిలైట్ టోల్ సిస్టమ్ త్వరలో ప్రారంభం కానుంది. బెంగుళూరు, మైసూర్, పానిపట్‌లలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా ఉపయోగిస్తున్నారు. దేశంలో ఈ ఏడాదిలోనే ఈ టోల్ విధానం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

# సుప్రీంకోర్టుకు చేరిన నీట్ పరీక్ష అవకతవకల వివాదం

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలనే నిర్ణయాన్ని పిటిషన్ దారులు సుప్రీంలో సవాలు చేశారు. ఏపీకి చెందిన నీట్ విద్యార్థులు జరుపాటే కార్తీక్, అబ్దుల్లా మహ్మద్ ఫైజ్ సహా విద్యార్థి శివంగి మిశ్రా, ఇతరులు కూడా ఇదే విధంగా పిటిషన్ దాఖలు చేశారు. కార్తీక్ ప్రభృతులు తమ పిటిషన్‌ను ముందస్తు విచారణ కోసం సుప్రీంకోర్టు రిజిస్ట్రీని అభ్యర్థించారు. మే 5న నిర్వహించనున్న పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని పిటిషన్‌లో వారు డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని సిట్‌తో దర్యాప్తు చేయించాలని పిటిషన్‌లో కోరారు. అటు ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై కోర్టు ఎన్టీఏ నుంచి సమాధానం కోరింది. దీనిపై ఈ నెల 12వ తేదీన విచారణ చేయనున్నట్లుగా హైకోర్టు తెలిపింది. మరోవైపు నీట్ ఫలితాలపై పెరుగుతున్న వివాదం నేపథ్యంలో ఎన్టీఏ విద్యా మంత్రిత్వ శాఖ యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఎన్టీఏ నిర్ణయాలపై వచ్చిన విమర్శలను, విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఈ ప్యానెల్ విచారించి నివేదిక సమర్పించనుంది. వివాదానికి కేంద్రమైన పరీక్ష కేంద్రాల్లోని విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సమర్థించుకుంది. పలు రాజకీయ పార్టీలు సైతం నీట్ ఫలితాల అవకతవకలను తప్పుబట్టడంతో వివాదం ముదిరింది.

# గ్రూప్-4 పోస్టుల ధ్రువపత్రాల పరిశీలనకు తేదీ ఖరారు

మొదటి పేజీ తరువాయి

పరిశీలనకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. వారిని మాత్రమే విడతల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన రోజు వారీ తేదీలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వెల్లడించారు. ఈ క్రమంలో అభ్యర్థులంతా ఈ విషయం గమనించి వారికి కేటాయించిన తేదీల్లో వెరిఫికేషన్కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# వికారాబాద్ అడవిలో భారత నౌకాదళం

మొదటి పేజీ తరువాయి

చేయనుంది. పూడూరు మండలంలో ఈ స్టేషన్ ఏర్పాటు చేయనుండగా వికారాబాద్ జిల్లా దామగుండం రక్షిత అటవీ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం 2,901 ఎకరాల అటవీ భూమిని నేవీకి కేటాయించారు. తాజాగా ఆ అటవీ భూమిని నౌకాదళం తమ అధీనంలోకి తీసుకుంది. ఈ ప్రాంతం చుట్టూ సరిహద్దులు ఏర్పాటుచేసే ప్రక్రియను ప్రారంభించింది. 2027 చివరి నాటికి వీఎల్ఎఫ్ నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## మారిన కాంగ్రెస్... మంచిదేనా

ఒక చేతితో చప్పట్లు కొట్టలేనట్లే.. బలమైన, నమ్మకమైన విపక్షం లేనప్పుడు దానిని ప్రజాస్వామ్య దేశంగా నమ్మలేం. సర్కారు నిరంకుశ పోకడల నివారణకు గట్టి ప్రతిపక్షం ఉండి తీరాల్సిందే' అన్నారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్. గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో మన పార్లమెంటులో కమలం పార్టీ విజృంభణ కారణంగా బలమైన విపక్షం లేకుండా పోయింది. ఈ కారణంగా గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం అనేక ఏకపక్ష నిర్ణయాలను తీసుకుని ప్రజాస్వామ్య భావనలను అపహాస్యం చేసింది. ప్రజలు అధికారం ఇచ్చిన పార్టీగా మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టలేని వారు సైతం.. వాటిని ప్రకటించిన తీరు, అమలు చేసిన వైనంపై తమ అసంతృప్తిని వెల్లడించారు. అయితే, 2024 సాధారణ ఎన్నికల్లో చలిచీమలు ఒక్కటై బలమైన సర్పాన్ని కట్టడిచేసినట్లుగా ఎన్డీయే కూటమికి ఊహించని షాక్ ఇచ్చాయి.'జుడేగా భారత్, జీతేగా ఇండియా' భారత్ ఒక్కటవుతుంది, ఇండియా కూటమి గెలుస్తుంది అనే నినాదంతో 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్' (ఇండియా) ప్రజల ముందుకు వచ్చింది. కూటమి పేరు ద్వారానే ప్రజలకు ప్రతిపక్షాలు ఒక స్ఫూర్తిదాయక సందేశాన్ని పంపాయి. నియంతృత్వ రాజకీయాలు, బలహీనపడుతున్న రాజ్యాంగం, సమాఖ్య పాలనా విధానం, నిర్వీర్యమవుతున్న ప్రజాస్వామిక హక్కులు, ప్రశ్నించిన ప్రతిపక్షాన్ని దోషిగా చూపే ప్రయత్నాలు, సామాజిక సాధికారత, మతపరమైన మైనారిటీలు, అణగారిన వర్గాల సమస్యలు, మణిపుర్ విషాదం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆశ్రిత పక్షపాతం, జాతీయ ఆస్తుల అమ్మకాలు, కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టటం, రైతుల దుస్థితి వంటి అంశాల మీద ఇండియా కూటమి ఎక్కువగా దృష్టిపెట్టింది. ఇండియా కూటమి విజయానికి రాహుల్ గాంధీ చేసిన పాదయాత్ర, దేశంలోని మెజారిటీ ప్రాంతాల ప్రజలతో మమేకమై వారి మనసు గెలుచుకోవటమూ కలిసొచ్చింది.కూటమిలో అతిపెద్ద, బలమైన పార్టీగా కాంగ్రెస్ ఉన్నప్పటికీ, ఎక్కడా ఆధిపత్య భావన చూపకుండా, ఆయా రాష్ట్రాల్లో స్థానిక పార్టీల మాటకు విలువిచ్చింది. అక్కడి క్షేత్రీయ ఆకాంక్షలకు కాంగ్రెస్ అండగా నిలిచింది. గెలిచే సత్తా ఉన్న మిత్రపక్షాల కోసం నాలుగడుగులు వెనక్కి వేసింది. మునుపెన్నడూ లేనంత తక్కువగా కాంగ్రెస్ ఈ సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 326 స్థానాల్లో పోటీ చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), బిహార్ (40), తమిళనాడుల్లో (39) మొత్తం 207 స్థానాలు ఉండగా.. వాటిలో కాంగ్రెస్ కేవలం 52 చోట్ల పోటీ చేసింది. అంటే కేవలం 25 శాతం స్థానాలకు పరిమితమైంది. ఈ రాష్ట్రాల్లో హస్తం పార్టీ తన మిత్రపక్షాల కోసం పెద్ద త్యాగమే చేసింది. యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి 62, బీహార్‌లో లాలూయాదవ్ పార్టీ ఆర్జేడీకి 24, తమిళనాట డీఎంకేకు 22, మహారాష్ట్రలో శివసేన, శరద్ పవార్ పార్టీలకు 31 స్థానాలను కేటాయించింది. వీరుగాక సీపీఎం, సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీ, ఝార్ఖండ్ ముక్తి మోర్చా, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీల విషయంలోనూ ఇలాంటి ఉదారతనే చూపింది. ఈ సంయమన వ్యూహం కారణంగానే 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తన బలాన్ని రెండింతలు పెంచుకొని 100 సీట్లు సాధించటమే గాక, ఇండియా కూటమి బలం 234కి చేరి అధికారానికి రెండు అడుగుల దూరంలో ఆగిపోయినా, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదుల్లో గొప్ప ఆశను నింపగలిగింది. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 31.34శాతం ఓట్లు సాధించిన బీజేపీ 282 సీట్లు సాధించగా, 2019 నాటికి తన బలాన్ని మరింత పెంచుకుని 37.7శాతానికి చేరి, 303 సీట్లను ఒడిసిపట్టింది. ఈ పదేళ్ల మోదీ పాలనలో కేంద్రం తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఏకపక్ష భావన బలంగా కనిపించింది. అలాగే, పాలనలో జవాబుదారీతనం, ప్రశ్నించిన వారిని ద్రోహులుగా చిత్రీకరించే వాతావరణం కొనసాగింది. ఈ రెండు ఎన్నికల్లో కమలనాథుల విజయంలో వారు ఎంచుకున్న ఎజెండా ప్రభావం కంటే, విపక్షాల అనైక్యతే ప్రధాన కారణంగా నిలిచింది. ఈ ఆలోచన నుంచే మొగ్గ తొడిగిన ఇండియా కూటమి, ఎన్నికల పరీక్షలోనూ నెగ్గి బలమైన విపక్ష పాత్రకు సిద్ధంగా ఉంది. అయితే, ఈసారి విపక్ష నేత ఎవరు? అనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతోంది. ఈసారి రాహుల్ గాంధీ ఈ పాత్రను పోషించాలని అటు కాంగ్రెస్‌తో బాటు పలు రాజకీయపక్షాలూ కోరుతున్నాయి. పాదయాత్రతో తానేంటో చాటుకోవటంతో బాటు కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో సొంత సర్కార్లను నడుపుతుండగా, తమిళనాడు, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అధికార కూటముల్లో భాగస్వామిగానూ ఉంది. దేశపు అతి ప్రాచీన రాజకీయ పక్షపు ప్రతినిధిగా రాహుల్ గాంధీ విపక్షనేతగా రాణించగలరనే నమ్మకం చాలా వర్గాల్లో వ్యక్తమవుతోంది.ప్రభుత్వం చేసే తప్పులను సకాలంలో ఎత్తిచూపించగల బాధ్యతాయుత సమర్థ ప్రతిపక్షం కోసం నేడు దేశం ఎదురుచూస్తోంది. దేశ విశాలహితం దృష్ట్యా అది ఒక తప్పనిసరి అవసరం కూడా. ఈ వాస్తవాన్ని గుర్తించి ఇకపై కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో, ఉమ్మడి దృక్పథంతో ఇకపై మందుకు నడవాలి. చర్చకు వచ్చిన కీలక అంశాల విషయంలో తమ వైఖరి, దృక్పథాలను విపక్షం పార్లమెంటు వేదికగా చెప్పగలగాలి. అదే సమయంలో భారత సమాఖ్యను బలోపేతం చేయడం, మసిబారుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రభను పునరుద్ధరించడంపై తమ ఆలోచనలను ప్రజలకు ఆయా వేదికల ద్వారా విస్పష్టంగా విడమరచాలి. రాబోయే ఐదేళ్లలో విపక్షం ఈ విషయంలో ఏమేరకు విజయం సాధించగలదనే దానిని బట్టే వచ్చే ఎన్నికల ఫలితాలు మాత్రమే గాక ఈ దేశ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉండబోతోంది.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నేరేడుచర్ల, జూన్ 10(తీన్మార్ న్యూస్):పూర్వ విద్యార్థుల ఆత్మీయ అనురాగ సమ్మేళనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు 2004-05 నందు 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల వీడి రెండు దశాబ్దాలు సమీపిస్తున్న సందర్భంగా బాల్య స్నేహితులతో కలిసి ఆనందోత్సాహాలతో పాఠశాల ప్రాంగణం నందు సందడి చేశారు నాటి మధురజ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు. నాడు తమకు బోధించిన గురువుల్ని ఆప్యాయ పూర్వకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అధ్యక్షత వహించిన ప్రస్తుత ప్రధానోఉపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం అత్యంత మధురమైనదని బాల్య స్నేహితులను ఎవరు వదులుకోలేరని అందుకు నిదర్శనం పాఠశాలల్లో జరిగే ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు అని స్నేహాను బంధాలను కొనియాడారు. నాటి ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి శ్రీరామ్ రెడ్డి, కొప్పుల రంగారెడ్డి, ఉపాధ్యాయులు పిన్నెపు రెడ్డి, చంద్రారెడ్డి, ఏం.సువర్ణ, చిన్నప్ప, పిఈటి వెంకటరెడ్డి, సుందర్రావు, పద్మావతి, కురివెళ్ల శ్రీనివాసరావు, లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు తమ బ్యాచ్ తరపున పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 25 వేల రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. పూర్వ విద్యార్థులు పి.శ్రావణ్ కుమార్, బాలకృష్ణ, నరేష్, చిన్నమ్మాయి, నాగరాజు, సూర్య ప్రకాష్, చంటి, జానకి, నాగమ్మ, వెంకటరమణ, రాణి, శ్రీను, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# కుమార్తె అన్న ప్రసన్న కార్యక్రమంలో పేద విద్యార్థులకు చేయూత

### కందుల రామ్ కిషోర్ రెడ్డి పూర్ణిమ దంపతులు






గరిడేపల్లి, జూన్ 10(తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల లో కందుల రామ్ కిషోర్ రెడ్డి, పూర్ణిమ రెడ్డి దంపతుల ముద్దుల కుమార్తె పూర్విక రామ్ అన్న ప్రసన్న సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు 8 వేలరూపాయల విలువగల బ్యాగులు, టిఫిన్ బాక్స్ తదితర విద్యా సామాగ్రి పాఠశాల ప్రధానఉపాధ్యాయులు గుగులోతు సైదా నాయక్ చేతుల మీదగా పిల్లలకు అందజేసి, స్వీట్ల పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు వారి కుమార్తె అన్న ప్రసన్న సందర్భంగా పేద విద్యార్థులకు చేయూత ఇచ్చినారు. వీరు గత ఐదు సంవత్సరాల నుండి ఆశ్రీ సొసైటీ తరపున పేద విద్యార్థులకు పలు విధాలుగా చేయూతనందించినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోతు సైదా నాయక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

### – నేరేడుచర్ల లో జోరుగా బడిబాట కార్యక్రమం




నేరేడుచర్ల, జూన్ 10(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల పురపాలిక పరిధి ఎన్టిఆర్ నగర్, చింతబండ మరియు పోలీస్ స్టేషన్ వెనకవైపు ఆవాస ప్రాంతాల నందు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల యందుగల మెరుగైన విద్య వసతులు పలు సదుపాయాలు మరియు ప్రభుత్వం ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా అందించుచున్న రెండు జతల సారూప్య దుస్తులు పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు గ్రంథాలయము పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనము ఉదయం రాగజావా డిజిటల్ తరగతుల ద్వారా ఆధునిక సదుపాయాలతో బోధన తదితర సౌకర్యాల గురించి అవగాహన కల్పించి పిల్లలను తమ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ప్రధానోపాధ్యాయిని ఉపాధ్యాయులు మాతంగి సైదులు, రావిరాల శౌరి, కట్ట వెంకటేశ్వరరావు, చల్లా ప్రభాకర్ రెడ్డి, నాగండ్ల నరసింహా రావు, స్రవంతి, పిడి రవికుమార్, ఎం.కృష్ణ ప్రసాద్, కురివెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి

### – ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం
### – ఎక్స్ పర్ట్ కమిటీతో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలి
### – ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను డిమాండ్



నేరేడుచర్ల, జూన్ 10(తీన్మార్ న్యూస్): వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యుజి ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) ఆధ్వర్యంలో నీట్ డైరెక్టర్ దిష్టిబొమ్మను నేరేడుచర్ల ప్రధాన కూడలి లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4వ తేదీన నీట్ 2024 ఫలితాలను ప్రకటించిందని, అయితే ఈ ఫలితాలలో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందని వారు అన్నారు. హర్యానా లోని పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం ఈ పరీక్షలో ప్రశ్నాపత్నం లీక్ అయ్యిందా..? లేక మాస్ కాపీయింగ్ జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నా యన్నారు. కొంతమంది విద్యార్థులకు గ్రేస్ ఇచ్చామని చెబుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇచ్చారో చెప్పకపోవడం పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ వివాదంపై తాజాగా ఎన్టీఏ వివరణ ఇచ్చిందని, కొన్ని కేంద్రాల్లో పరీక్ష నిర్వహణలో జాప్యం జరిగిందని వారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయడం కోసం గ్రేస్ మార్కులు ఇవ్వడం అభ్యర్థులు హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారని, వారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయడం కోసం గ్రేస్ మార్కులు ఇవ్వడం జరిగిందని డైరెక్టర్ చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ఇలా గ్రేస్ మార్కులు పొందిన వారిలో మైనస్ 20 నుంచి 720 వరకు మార్కులు వచ్చిన విద్యార్థులూ ఉన్నార న్నారు. నీట్ పరీక్షలో కొన్ని సెంటర్లలో విద్యార్థులు సమయం కోల్పో వడం వల్ల వారు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే గ్రేస్ మార్కులు ఇచ్చామని ఎన్టిఏ వివరించిందని, అయితే ఏ ప్రాతి పదికన ఎంత గ్రేస్ మార్క్ ఇచ్చారో మాత్రం ఎన్టిఏ స్పష్టత ఇవ్వలేదన్నారు. కేవలం కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు మాత్రమే గ్రేస్ మార్కులు ఇచ్చారని, మిగతా విద్యార్థులకు గ్రేస్ మార్కులు కేటాయించకపోవడం పట్ల విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా చాలా సెంటర్ల లో పేపర్ ఆలస్యంగా రావడం వల్ల విద్యార్థులు సమయం కోల్పో యారని పలువురు నిపుణులు పేర్కొంటున్నారన్నారు. గ్రేస్ మార్కుల ఇవ్వడంపై ఎన్టిఏ వివరణ సంతృప్తికరంగా లేదని, విద్యార్థులు ఎంత సమయం కోల్పోతే ఎంత గ్రేస్ మార్కులు ఇచ్చారో ప్రతిపాదిక వివరించాలని వారు డిమాండ్ చేశారు. నీట్ యుజి పరీక్ష రాసిన విద్యార్థుల సందేహాలు ఎన్టిఏ నివృత్తి చేయాలని, అప్పుడే పరీక్ష పారదర్శకంగా జరిగినట్లుగా అందరూ భావిస్తారని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్, ఏఐవైఎఫ్ నాయకులు, కొమరాజు వెంకట్, సొల్లేటి శివ, నందిపాటి పండు, చిలక రాజు జయంత్, వనపర్తి యశ్వంత్, రాహుల్, నరసింహ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో గురుకుల విద్యార్థి ప్రతిభ



దేవరకద్ర, జూన్ 10(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం పరిధిలోని కొత్తకోట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని పీ సౌమ్య శ్రీ జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రిపరేటరీ ర్యాంకు 6931 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.మాలతి, కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థి పి సౌమ్యశ్రీ ని శాలువాతో అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాలతి మాట్లాడుతూ మునుముందు చదువుల్లో మంచి ప్రత్యేక ఘనపరచాలని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# రాష్ట్ర సదస్సుకు తరలిన ఉపాధి కూలీలు




ఆత్మకూర్, జూన్ 10(తీన్మార్ న్యూస్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్లో తలపెట్టిన రాష్ట్ర సదస్సుకు అమరచింత నుంచి ఉపాధి కూలీలు తరలి వెళ్లారు. రాష్ట్ర సదస్సులో ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. సదస్సుకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో తరలినట్లు ఆయన తెలిపారు.

# ఈనెల 12న వాహనాల వేలం పాట

సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): ఈనెల 12వ తేదీన వాహనాల వేలంపాట నిర్వహించనునట్లు సూర్యాపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మల్లయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన 22 వాహనాలకు ఈ నెల 12న సూర్యాపేట ఎక్సైజ్ శాఖ నందు జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు అదే రోజు ఉదయం 9 గంటలకు స్టేషన్ నందు ముందుగా ధరావతు చెల్లించాలన్నారు.

# తీన్మార్ మల్లన్నకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



### భువనగిరి మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఆబెద్ అలీ

భువనగిరి టౌన్, జూన్ 10(తీన్మార్ న్యూస్): నల్లగొండ వరంగల్ ఖమ్మం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్క పట్టబద్రులకి భువనగిరి మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఆబెద్ అలీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక పట్టపద్రుల చే ఎన్నుకోబడిన ప్రజా నాయకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విద్యార్థుల ఉద్యోగస్తుల, నిరుద్యోగుల సమస్యల మీద మీ గళాన్ని వినిపిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- ప్రజావాణికి 79 ఫిర్యాదులు**

**- జిల్లా కలెక్టర్ శశాంక**



ఇబ్రహీంపట్నం, జూన్ 10(తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (79) ఫిర్యాదులు అందాయి. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రజావాణిని జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం నుంచి మళ్ళీ పునరుద్ధరింపజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ శశాంకతోపాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డిఆర్ఓ సంగీతలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేసి, తదనంతరం పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పంపించడం జరుగుతోందని, అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు .రిజిస్టర్ లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగిందని, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయని తెలుస్తుందని తెలిపారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు రిజిస్టర్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులందరు రావాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్న లిఫ్టులతో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో సాగునీరు**

**- జూన్ 30 కల్లా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి**

**- రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి**



సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కోదాడ పట్టణంలోని గుడు గుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములపై సంబంధిత అధికారులు రైతులతో జరిపిన సమీక్షా సమావేశంలో కోదాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై దృష్టి సారించిందని, తక్కువ ఖర్చుతో సాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా లిఫ్ట్ ఇరిగేషన్ పై దృష్టి సారించలేదని దీనివల్ల రైతులు చాలా నష్టపోయారని మంత్రి తెలిపారు. హుజూర్నగర్ నియోజకవర్గంలో 35 లిఫ్టులు, కోదాడ నియోజకవర్గంలో 19 లిఫ్టులు ఉన్నాయని జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ల పథకాలు నాగార్జునసాగర్, కృష్ణా నదిపై, మూసీ నదిపై, కొన్ని పాలేరు వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ నిర్మాణం చేయడం జరిగిందని, గతంలోని పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇరిగేషన్ పథకాలన్నీ నిర్వీర్యం అయ్యాయని మంత్రి తెలిపారు. ఇరిగేషన్లు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని లిఫ్టులన్నీ జూన్ 30వ తేదీ కల్లా 100% పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. లిఫ్టులను పూర్తిస్థాయిలో మరమ్మత్తుల అనంతరం లిఫ్టులను పర్యవేక్షించడానికి కాంటాక్ట్ పద్ధతి పై లిఫ్ట్ ఆపరేటర్, ఎలక్ట్రిషన్, ఫిట్టర్, వాచ్మెన్ వంటి సిబ్బందిని తాత్కాలిక పద్ధతిలో నియమించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. నీటి లభ్యత ఉన్నచోట కొత్తగా డిజైన్ చేసి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములను మంజూరు చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. చివరి ఆయకట్టు వరకు నిరంధించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. కొత్త ఇరిగేషన్ స్కీములు కొరకు భూసేకరణ చేయడం జరుగుతుందని కావున రైతులు తమ పూర్తి సహకారాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులకు అందించాలని మంత్రి సూచించారు. నేటిపారుదల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని మంత్రి తెలిపారు. చెరువులను ఆక్రమణకు గురి అయితే అట్టి వారిపై కేసులు పెట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ పై ఇంత పెద్ద ఎత్తున రైతులు, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు అందరితో సమావేశం పెట్టి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేయడం వలన ఈ లిఫ్టు ఇరిగేషన్ స్కీముల ద్వారా రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందని కలెక్టర్ తెలిపారు. రైతు యొక్క ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, రెవెన్యూ డివిజన్ అధికారులు చెరువుల ఆక్రమణ, ప్రభుత్వ భూముల రక్షణ కొరకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చెరువులలో పూడిక తీసుకోనుటకు ప్రతి గ్రామంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యవసాయ పంటల కొరకు అయితే చెరువు మట్టిని వాడుకొనుటకు రైతులకు అవకాశం కలిగిస్తామని, ఆ సాకు తో చెరువులను ఆక్రమించాలని చూసై అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రైతులు ఇచ్చిన సలహాలను సూచనలను అధికారులు నోట్ చేసుకోవాలని వారు కోరిన ప్రకారం స్కీములను మరమ్మతులు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎల్యం ఇన్సి డి. నాగేంద్రరావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఎస్సీ నరసింహారావు, ఈఈలు సత్యనారాయణ, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చందర్రావు, మాజీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రైవేటు విద్య సంస్థలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, నోట్ బుక్స్, స్టేషనరీ,ని నిషేదించాలి

**- అట్టి అమ్ముతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి**




ఆత్మకూర్, జూన్ 10(తీన్మార్ న్యూస్): ఆత్మకూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తూ ప్రైవేటు పాఠశాలలు, సిబీఎస్సి సంస్థల్లో యూనిఫామ్, షూ, బుక్స్, స్టేషనరీ అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మండల విద్యాధికారి భాస్కర్ సింగ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ లు మాట్లాడుతూ ఆత్మకూరు, అమరచింత ఈ రెండు మండల కేంద్రాలలో కొనసాగుతున్న చిన్న , పెద్ద ప్రయివేటు పాఠశాలలో యూనిఫామ్స్, షూ, బుక్స్, స్టేషనరీ వంటి వాటిని అమ్మవద్దు అని గతం లో ప్రభుత్వం" జివో లను విడుదల చేసిన కూడా వాటిని పట్టించు కోకుండా యాజమాన్యలు పేద విద్యార్థుల నుండి అధిక ధరలకు అమ్ముతూ డబ్బులు వసూలు చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను ఒక వ్యాపారంగా చేస్తున్నారు. బీద మధ్య తరగతి వారు చదువుకోలేక పోతున్నారు అని అన్నారు. కావున ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా యూనిఫామ్స్, బుక్స్, షూ, స్టేషనరీ వంటి వాటిని అమ్ముతున్న పాఠశాల తనిఖీలు చేసి చర్యలు తీసుకోవలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ భూదందా..... దొరికినకాడికి దోచుకోవమే పని...

**- విచ్చలవిడిగా కబ్జా చేసిన గత ప్రభుత్వ పాలకులు**

**- పూర్తి సమాచారం సేకరించిన ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ**

**- గవర్నమెంట్ స్థలాలలో విచ్చలవిడిగా కబ్జాలు**

**- వెంకటేశ్వర స్వామి భూమినీ ను కూడా దోచుకున్న భూబకాసురులు**

**- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న వైనం**

**- కోట్ల రూపాయల అక్రమ దందా**

**- ఎవరు అండదండలతో ఈ పని చేశారు...?**

**- అడిగేవారు లేకుంటే అంతా మాయం**

**- ఆత్మకూరు మునిసిపల్ కేంద్రం ఎదుట టిపిసిసి అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా...**






ఆత్మకూర్, జూన్ 10(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో ఏదేచ్ఛగా అక్రమ భూధందా జరుగుతుంది. గత ప్రభుత్వ పాలకులు మరియు అధికారులు కుమ్మక్కై గ్రామ పంచాయతీగా ఉన్నటువంటి అప్పటి గ్రామ కంటానికి సంబంధించిన భూములను, మున్సిపాలిటీ అయిన తర్వాత ప్రభుత్వానికి వచ్చే టెన్ పర్సెంట్ ల్యాండ్ ను మరియు ఇతర లబ్ధిదారుల యొక్క భూములను కబ్జా చేసి బినామీలుగా మార్చిన వైనం. భూ కబ్జాదాకులు ఎంతటి వారైనా సరే వదిలే ప్రసక్తి లేదని పట్టుబడిన కాంగ్రెస్ నాయకులు. పూర్తి వివరాలు సేకరించిన కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. భూ ఆక్రమణకు సంబంధించినటువంటి వినతి



పత్రాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి కి, మున్సిపల్ శాఖ మాత్యులు హైదరాబాద్ కి, మున్సిపల్ కమిషనర్ హైదరాబాద్ కి, రాష్ట్ర మున్సిపల్ ఎన్ఫోర్మెంట్ అధికారికి, అవినీతి నిరోధక శాఖ అధికారికి, జిల్లా మున్సిపల్ కమిషనర్ వనపర్తి కి, జిల్లా ఆర్డీవో అధికారికి వినతి పత్రాలను పంపించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి, కల్లుగీత డిపార్ట్మెంట్ సెల్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, ఆత్మకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్ పరమేష్, టౌన్ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, మక్తల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసి రాజు యాదవ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, ఈర్లదిన్నె తదితర నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి అర్జీని పరిష్కరించాలి


**- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్**



సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): గ్రీవెన్స్ లో వచ్చే ప్రతి ధరఖాస్తు ని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, జెడ్పి. సిఈఓ అప్పారావు, డిఆర్డీఓ మధుసూదన్ రాజు తో కలసి పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను అధికారులు జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. సూర్యాపేట పట్టణ పరిధిలో గల ఇందిరమ్మ మూడవ పేజ్ కాలనిలోని అలాగే కేసారం లో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు పొందిన లబ్దిదారులకు ఇల్లులను అప్పగించుటకు 10 టీమ్ లు ఏర్పాటు చేసి సత్వరమే సమస్య ని పరిష్కరించి లబ్ధిదారులకు త్వరగా ఇల్లులను అప్పగించాలని సూర్యాపేట ఆర్డిఓ వేణు మాధవ్ ని ఆదేచించారు. తదుపరి జూన్ 12 న పాఠశాలలు పునః ప్రారంభ సందర్బంగా పనులు పూర్తి అయిన అమ్మ ఆదర్శ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే గార్ల చే ప్రారంభించి విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు వారిచే ఇప్పించవల్సిందిగా ఆర్డీఓ లను, డిఈఓ కు, ఎంపీడీఓ లకు, ఏంఈఓ లకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అధికారులు తప్పకుండ హాజరు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో ఎక్కువగా భూసమస్యలకు సబందించి 36, ఇతర శాఖలకు సంబంధించి 32 మొత్తం 68 దరఖాస్తులు అందాయని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవ్, డిఈఓ అశోక్, డిపివో సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్వో కోటాచలం, డిటిడిఓ శంకర్, డిడబ్ల్యూవో వెంకట రమణ, ఏవో సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులపై సమీక్ష సమావేశం

**- నిర్వహించిన డిఎంహెచ్వో కోటాచలం**




సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): జిల్లాలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను డిఎంహెచ్వో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ ఆలోపతి ఆసుపత్రులు, ఆయుర్వేద, హోమియో, ఆయుష్ క్లినిక్కులు విధిగా నమోదు చేసుకోవాలి, అగ్ని మాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలి. లేకుంటే కఠిన చర్యలు డాక్టర్ కోటచలం అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆలోపతి ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్ లో, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఎక్స్ రే, డెంటల్ మరియు ఫిజియోథెరపీ సెంటర్లు ఆయుర్వేద, హోమియో, ఆయుష్ క్లినిక్కులు విధిగా నమోదు చేసుకోవాలని అగ్నిమాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలని లేకుంటే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి ముందస్తు ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే రూ.లు 50,000/- ఫైన్ విధిస్తామని నేడు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయములో నిర్వహించిన సమీక్షా సమావేశంలో హెచ్చరించినారు. ప్రభుత్వాదేశానుసారము పైన తెలిపిన అన్నీ ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ లలో తప్పని సరిగా అగ్నిమాపక నియంత్రణ ప్రమాణాలు పాటించాలని, సర్వే నిర్వహిస్తున్నామని తెలిపినారు. 15 మీటర్ల కంటే తక్కువ ఉన్న అన్ని ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ లలో Fire Extinguisher Certificate/ భవన విస్తీర్ణంకు అవసరమగు సిలిండర్లు కలిగి ఉండవలెను. 15 మీటర్ల కంటే ఎక్కువ ఉన్న భవనములలో నిర్వహిస్తున్న వారు అగ్నిమాపక అధికారుల నుండి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ / ధ్రువీకరణ పత్రము పొంది ఉండవలెను. ఇప్పటికీ అనుమతి లేని, అగ్నిమాపక నియంత్రణ సర్టిఫికేట్ లేని అన్ని ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ తేదీ. 14.06.2024 వరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించవలెను. మా కార్యాలయ ప్రతినిధులు సమాచారం కోరిన వెంటనే సహకరించి ఇవ్వగలరు. పై నిబంధనలు అతిక్రమించిన చట్ట రీత్యా చర్యలు తీసుకొనబడునని తెలిపారు.

# సివిల్ సప్లై కార్యాలయం ముందు హమాలీల నిరసన

హైదరాబాద్: పంజాగుట్ట ఎర్రమంజిల్ కాలనీలోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద హమాలీలు తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని నిరసన చేపట్టారు . పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు పెంచాలని ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని హమాలీలకు ప్రాఫిడెంట్ ఫండ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ పథకాన్ని సంపూర్ణంగా రద్దుచేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేస్తున్న హమాలీలను పోలీసులు అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. తాము కమిషనర్ను కలిసిన తర్వాతే ఇక్కడి నుంచి వెళ్తామని కూర్చున్నారు. అదే సమయంలో కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న కమిషనర్ వారి వద్దకు వచ్చి వినతి పత్రాన్ని స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన విరమించారు.

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

**– వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకి సమావేశం**

**– ఆదేశాలు జారీ చేసిన మంత్రి సీతక్క**




భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): వర్షాకాలం ప్రారంభమైనందున వరదల వలన నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసారి అనసూయ (సీతక్క) ఆదేశించారు. సోమవారం నాడు ఆమె జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధుల పట్ల, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షిస్తూ, వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు, వరదల వలన నష్టం కలగకుండా ముందస్తుగా శిథిలమైన, కూలిపోయే ఇండ్లను గుర్తించి కూల్చి వెయ్యాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదలకు మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వాతావరణంలో వచ్చిన మార్పుల వలన సీజన్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి త్రాగు నీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, లీకేజీ పైపుల ద్వారా కలుషితమైన నీరు వచ్చే అవకాశం ఉన్నందున లీకేజీ పైపులను గుర్తించి రిపేరు చేయాలని, మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపరచాలని, పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ పెట్టాలని చెత్త కుప్పలను మురికి కాలువలను శుభ్రం చేసుకోవాలని, గ్రామాలలో పరిశుభ్రత పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపటట్టాలని, సీజన్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు




ప్రబలకుండా, దోమలు చేరకుండా మందులు చల్లడం, చెత్త వస్తువులను తొలగించడం, పిచ్చి మొక్కలను తొలగించడం చేయాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో అన్ని మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేపట్టామని, పిచ్చి మొక్కలు పెరగకుండా, వర్షాకాలంలో నీటి నిల్వ కాకుండా, దోమలు ప్రబలకుండా, డెంగ్యూ, మలేరియా, అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులలో భాగంగా పాఠశాలల్లో త్రాగు నీటి ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు అందించే డ్రస్సులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణన్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, మిషన్ భగీరథ ఎస్సీ కృష్ణయ్య, ఈ.ఈ. కరుణాకర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్ రెడ్డి, భువనగిరి ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జేండగే**



భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 10(తీన్మార్ న్యూస్): సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి 40 ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖ 30, మున్సిపాల్ శాఖ 5, విద్యాశాఖ 3, పోలీసు, కార్మిక శాఖలు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలలకు





చెందిన మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఏ. కృష్ణన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

# గులాబీలో అంతర్మధనం...

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 37.35 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు 16.68 శాతం ఓట్లు మాత్రమ వచ్చాయి. అంటే ఐదు నెలల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓట్లు 21 శాతం పక్క పార్టీలకు వెళ్లిపోయాయి. అందులో కొంత కాంగ్రెస్.. అత్యధికంగా బీజేపీ పొందాయి. అంటే బీఆర్ఎస్ పార్టీ శరవేగంగా కరిగిపోతోంది. ఆ బలాన్ని బీజేపీ అందుకుంటోంది. దీనికి కారణం బీఆర్ఎస్‌కు బలమైన ఓటు బ్యాంక్ లేకపోవమే అనుకోవచ్చు. రాజకీయ పార్టీ బలంగా ఉంది అని చెప్పుకోవాలంటే అందరూ చూసే ఒకే ఒక్క పాయింట్ ఆ పార్టీకి ఎంత ఓటు షేర్ ఉంది అనే. ఈ ఓటు షేర్ అనేది రాజకీయ వ్యవహారిక భాషలో ఓటు బ్యాంక్ అని చెప్పుకోవచ్చు.పార్టీకి నిజాయితీగా ఓట్లు వేసే ఓటర్లు ఎంత ఎక్కువ మంది ఉంటే వారందర్నీ ఓటు బ్యాంక్ అనుకోవచ్చు. ఓటు బ్యాంక్ ఉన్న పార్టీకే విలువ ఉంటుంది. ఈ ఓటు బ్యాంక్ ను రాజకీయ పార్టీలు వివిధ పద్ధతుల్లో క్రియేట్ చేసుకుంటూ ఉం?యి. కులం, మతం, ప్రాంతం , భావోద్వేగ అంసాల ఆధారంగా సృష్టించుకుంటాయి. ప్రస్తుతం అత్యధిక పార్టీల ఓటు బ్యాంక్ కులమే. ప్రస్తుతం దేశంలో అయినా రాష్ట్రాల్లో అయినా రాజకీయ పార్టీలు బలంగా ఉన్నాయంటే.. కులాల సపోర్టుతోనే. తెలుగుదేశం పార్టీకి కమ్మ, బీసీ వర్గాలు అండగా ఉంటూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ముస్లిం, దళితులు, రెడ్డి వర్గం వారు సపోర్టు చేస్తున్నారు. ఏపీలో వైసీపీకి రెడ్డి, ముస్లిం, దళిత వర్గాల మద్దతు ఉంది. ఏపీలో జనసేన పార్టీ కీలకంగా మారిందంటే దానికి కారణం కాపు వర్గం మద్దతు ఉండబట్టే. కేసీఆర్ కు ఈ ఓటు బ్యాంక్ రాజకీయాల సంగతి తెలియనిదేం కాదు. అందుకే ఆయన రాజకీయ పార్టీ పెట్టినప్పుడు కుల బలం చూసుకుంటే పరిమితంగా ఉంటామని..అయితే ప్రాంత భావనతో అయితే ఏకపక్ష విజయాలు వస్తాయి.. ప్రజలంతా ఓటు బ్యాంక్ అవుతారని అనుకున్నారు. అందుకే ప్రజల్లో నిగూఢంగా ఉన్నా తెలంగాణ వాదాన్ని అందుకున్నారు. ఒడిదుడుకులు అయినా ఆయన ముందుకు సాగారు. విజయంతం అయ్యారు. ఎన్నికల్లో ఆయన గెలిచిన ప్రతీ సారి తెలంగాణ సెంటిమెంటే విజయాస్త్రం. తెలంగాణ అంటే బీఆర్ఎస్ అన్నట్లుగా రాజకీయం సాగింది. అభ్యర్థి ఎవరన్నది చూసుకోలేదు..కారు గుర్తు ఉంటే చాలు ఓటేశారు. అంటే బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ .. తెలంగాణ సెంటిమెంట్ గుండె నిండా నింపుకున్న వారే. వారిలో సెంటిమెంట్ పెంచేందుకు కేసీఆర్ చేయగలిగినదంతా చేశారు. కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ప్రజలను ఓటు బ్యాంక్‌గా మార్చుకుని అనుకున్న విజయాలు సాధించారు. కానీ కులం, మతం లాగా.. ఈ తెలంగాణ సెంటిమెంట్ శాశ్వతం కాదు. అక్కడే కేసీఆర్ రాజకీయంగా తప్పటడుగు వేశారు. తెలంగాణ సాధనే లక్ష్యం అనుకున్న తర్వాత.. లక్ష్యం చేధించిన తర్వాత ఇక సెంటిమెంట్ ఉంటుందనుకోవడం అత్యాశే. అయితే కేసీఆర్ తనదైన రాజకీయంతో పదేళ్ల పాటు నెట్టుకు రాగలిగారు. ఈ పదేళ్లలో ఆయన తెలంగాణ సెంటిమెంట్ కు అతీతమైన ఓటు బ్యాంక్‌ను సృష్టించుకోవడంలో విఫలమయ్యారు. ఏ సామాజికవర్గాన్ని దగ్గర చేసుకోలేకపోయారు. కేసీఆర్ సొంత సామాజికవర్గం చాలా స్వల్పంగా ఉంటుంది. తెలంగాణ సెంటిమెంట్ లేకపోవడంతో బీఆర్ఎస్ ఘోర పరాజయాల్ని చవి చూసింది. రెడ్డి వర్గానికి కేసీఆర్ చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆయన కేబినెట్‌లో ఆరుగురు రెడ్డి మంత్రులు ఉండేవారు. కానీ వారంతా సంప్రదాయకంగా కాంగ్రెస్ మద్దతుదారులు. సెంటిమెంట్ కారణంగా బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. మళ్లీ కాంగ్రెస్ వైపు వెళ్లిపోయారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచిందేమీ లేదంటే.. వారు ఎంత దూరమయ్యారో అర్థం చేసుకోవచ్చు. చివరికి బీసీల్లోని ప్రధాన సామాజికవర్గాలను కూడా కేసీఆర్ కొన్ని కీలక నిర్ణయాలతో దూరం చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతం తెలుగుదేశం పార్టీ బలంగా ఉండటానికి కారణం బీసీల మద్దతే. విప్లవాత్మక నిర్ణయాలు, బీసీ నేతలకు అవకాశాలు కల్పించడం ద్వారా ఆ పార్టీకి మద్దతుగా ఉండేలా చూసుకున్నారు. ఇప్పుడు ఆ పార్టీ ఉనికి లేకపోవడం తో బీసీ వర్గాలు ఇతర పార్టీల వైపు మళ్లాయి. వీరిని ఆకట్టుకోవడంలో కేసీఆర్ నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ అనుకూలంగా మల్చుకుంది. పై సామాజికవర్గాలు బలమైన మద్దతుదారుగా ఉండటం వల్లే 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. రాష్ట్రవిభజన తర్వాత 2014, 2019 ఎన్నికల్లో పై సామాజికవర్గాలు బీఆర్ఎస్ కు మద్దతుగా ఉండటంతో వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. 2023 ఎన్నికల్లో కేసీయార్ స్వయంకృతం వల్ల మెజారిటి సామాజికవర్గాలు దూరమవ్వటంతో ఫలితం రివర్స్ అయింది. కేసీఆర్ మళ్లీ బీసీలను ఆకట్టుకుని బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ గా మార్చుకునే ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 17 పార్లమెంటు సీట్లలో ఆరుసీట్లను బీసీలకే కేటాయించారు. అయినా ఓట్లు వేయలేదు. అయితే తెలంగాణ సెంటిమెంట్ ను మళ్లీ పెంచుకుంటే.. ఓటు బ్యాంక్ పెరుగుతుంది. లేకపోతే మాత్రం.. మొదటికే మోసం వస్తుంది. ఉన్న ఓటు బ్యాంక్ మరింత కరిగిపోతుంది. అది బీఆర్ఎస్ పార్టీకి ఉనికి సమస్యను తీసుకు వస్తుంది.

# ఆధ్యాత్మికత వైపు సానియా

హైదరాబాద్: భారత టెన్నిస్ దిగ్గజం సానియా మిర్జా ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తోంది. భర్త షోయాబ్ మాలిక్‌తో విడాకుల తర్వాత సానియ లైఫ్ స్టైల్ పూర్తిగా మారిపోయింది. అందుకు ఆమె ఇన్‌స్టాగ్రామ్ వీడియోలే సాక్ష్యం. ఒంటరితనాన్ని జయించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఈ క్రమంలో సానియా మానసికంగా బలాన్ని పుంజుకోవడానికి దైవ చింతనపై దృష్టి నిలిపింది. ముస్లిం పవిత్ర స్థలమైన హజ్ యాత్రకు వెళ్లనుంది. ఈ మేరకు తన ఇన్‌స్టా ఖాతా ద్వారా వెల్లడించింది. ఈ యాత్ర తర్వాత తాను మానసికంగా పరివర్తన చెంది తిరిగి రావాలనుకుంటున్నట్లు పోస్టులో తెల్పింది.డియర్ ఫ్రెండ్స్, సన్నిహితుల్లారా.. మీకో న్యూస్. పవిత్రమైన హజ్ యాత్ర చేసే అవకాశం లభించింది. నేను పరివర్తన చెందేందుకు సిద్ధమవుతున్నాను. మీపట్ల ఏవైనా తప్పులు చేసి ఉంటే క్షమించండి. ఈ ఆధ్యాత్మిక జర్నీ పట్ల నేను కృతజ్ఞతా భావంతో ఉన్నాను. అల్లా నా పొరపాట్లను క్షమించి.. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటాడని నమ్ముతున్నా. జీవితకాల మజిలీకి సిద్ధమవుతున్న. నన్ను మీ ప్రార్థనలో గుర్తు చేసుకోండి. నేను మారిన హృదయం గల వ్యక్తిగా తిరిగొస్తానని ఆశిస్తున్నా' అని సానియా తన పోస్ట్‌లో రాసుకొచ్చింది.భారత టెన్నిస్‌లో సంచలనాలకు కేరాఫ్ అడ్రస్ సానియా. సానియ తన కెరీర్‌లో ఆరు టైటిళ్లు గెల్చుకుంది. మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ట్రోఫీలతో చరిత్ర సృష్టించిన ఈ టెన్నిస్ దిగ్గజం పాక్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్‌తో ప్రేమలో పడి 2010లో అగడిని పెళ్లాడింది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగగా 2018లో ఇజాన్ (కుమారుడు) జన్మించాడు. ఇంతలో షోయబ్ మరో పాక్ యువతి ప్రేమలో పడి సానియాకు విడాకులు ప్రకటించాడు. దీంతో సానియా, షోయబ్‌లు తమ పన్నెండేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు. అనంతరం అదే ఏడాది షోయబ్ తన ప్రేయసిని పెళ్లాడాడు

# కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు కోదాడలో అందుబాటులోకి తేవడం అభినందనీయం

**నాణ్యమైన వైద్య సేవలతో తేజ పిల్లల హాస్పిటల్ పేరు గడించాలి**

**డాక్టర్ జాస్తి సుబ్బారావు**

సూర్యాపేట జిల్లా: :కోదాడ పట్టణంలో చిన్నపిల్లలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తేవడం అభినందనీయమని కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని హుజూర్నగర్ రోడ్ లో అపోలో మెడికల్ షాప్ వెనుక డాక్టర్ అశోక్ కంటి ఆసుపత్రి ఎదురు వీధిలో డాక్టర్ కక్కిరేణి ప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన తేజ పిల్లల హాస్పిటల్ ,స్వప్న స్కాన్ సెంటర్ లను ఆయన ప్రారంభించి మాట్లాడారు . వైద్యశాల ను పూర్తి వ్యాపార దృక్పథంతో కాకుండా కొంతమేరకు సేవా దృక్పథంతో సేవలందించాలన్నారు. నాణ్యమైన వైద్య సేవలతో తేజ పిల్లల హాస్పిటల్ పేరు గడించాలన్నారు . నాణ్యమైన వైద్య సేవలు అందించి వృత్తికి వన్నె తేవాలన్నారు. వైద్యశాల డాక్టర్ కక్కిరేణి ప్రసాద్ మాట్లాడుతూ వైద్యశాల ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి రెండు వారాలు ప్రతి శుక్రవారం ఓపి ఉచితంగా చూస్తామన్నారు. పిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజిస్ట్ డాక్టర్ స్వప్న, డాక్టర్ రామారావు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శివ, రోజా, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ కకిరేణి కిషోర్, డాక్టర్ కక్కిరేణి దివ్య, కక్కిరేణి సూర్యనారాయణ, హరిబాబు, లచ్చయ్య రావెళ్ల సీతారామయ్య,బొల్లు రాంబాబు, గడ్డం నరసయ్య పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు హామీ ఇచ్చిన 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి

***బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సీ. హెచ్ విఠల్ డిమాండ్***

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు హామీ ఇచ్చిన 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సీ.హెచ్ విఠల్ డిమాండ్ చేసారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో ఆఉఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడిచింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక రకాల హామీలిచ్చారని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులు, నిరుద్యోగులకు సంబంధించి ప్రధానంగా హామీలిచ్చారు. వివిధ రకాల డిక్లరేషన్లు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు.రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2 లక్షల ఉద్యోగ ఖాళీలను పూర్తిచేయకపోవడం, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు ఆక్రోశానికి గురయ్యారు.రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు బీఆర్ఎస్ సర్కారుపై కక్షగట్టి గద్దెదించి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను పట్టించుకోవడం లేదు.2 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం, నిరుద్యోగ భృతి అమలు, టీఎస్ పీఎస్సీ ప్రక్షాళన, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ, జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలను ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.కాని, 6 నెలలు గడిచినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో మాత్రమే ఖాళీ ఉద్యోగాలను పూరించింది తప్పితే.. ఇప్పటివరకు ఒక్క జాబ్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. 2 లక్షల ఖాళీ ఉద్యోగాల భర్తీ కోసం జూన్ 2 తారీఖు లోగా నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి సెప్టెంబరు 17 లోగా నియామకపత్రాలు ఇస్తామని స్వయంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైంది..? 2 లక్షల ఉద్యోగ ఖాళీల్లో 200 కూడా పూరించలేదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచింది.జూన్ మాసం తర్వాత పెద్దఎత్తున ఉద్యోగులు రిటైర్ కాబోతున్నారు. దీంతో గతంలోని 2 లక్షల ఉద్యోగ ఖాళీలకు తోడు అదనంగా 50 వేల ఉద్యోగ ఖాళీలు ఏర్పడను న్నాయి.అసలు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం 2 లక్షల 50 వేల ఖాళీలను ఎప్పుడు నింపుతారనేది సమాధానం చెప్పాలి.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మోసపోయిన నిరుద్యోగుల పక్షాన ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం, నిరుద్యోగ భృతి అమలు కోసం, టీఎస్ పీఎస్సీ ప్రక్షాళన కోసం బిజెపి పోరాటం చేసింది.రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆక్రోశంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. అయితే నిరుద్యోగులకు రేవంత్ ప్రభుత్వం కూడా అన్యాయమే చేస్తోంది.ఇన్నిరోజులు ఎన్నికల కోడ్ సాకుతో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేసింది. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఆవేదనతో కుమిలిపో తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల 50 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ విటల్ డిమాండ్ చేసారు. లేదంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల తిరస్కారానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# అనుమతిలేకుండా మూగజీవాలను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం..?

**జిల్లా సరిహద్దు గుండా పశువుల అక్రమ రవాణాను కట్టడి చేయడానికి జిల్లాలో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు**

**అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు సమాచారం ఉన్నచో స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 సిద్దిపేట కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 సమాచారం అందించాలి**

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

సిద్దిపేట: ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు ఎవరైనా అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు దృష్టికి వస్తే సంబంధిత పోలీసులకు, లేదా కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలే తప్ప, స్వయంగా వెళ్లి అక్రమంగా అడ్డుకోనీ చట్టాన్ని చేతిలోకి తీసుకొని గొడవలు సృష్టించినట్లయితే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఒక బాధ్యత గల పౌరునిగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా పశువులను రవాణా చేసే అవకాశం ఉన్నందున, పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో ఆరు చెక్ పోస్ట్ నిర్వహించి ఎలాంటి అక్రమ తరలింపునకు పాల్పడకుండా ముందస్తుగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా సరిహద్దు వరంగల్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి సరిహద్దులతో పాటు జిల్లా అంతటా ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన పశువుల సంతలో పశువుల రవాణాకు కావాల్సిన అనుమతి పత్రాలు తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వధశాలకు అనుమతి లేని పశువులను, దూడలు,గోవులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని పశువుల వ్యాపారులు ఈ సున్నితమైన అంశాన్ని గమనించాలన్నారు. పశువులను ఒకచోట నుండి మరొక చోటికి తరలించడానికి పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా వెంట ఉండాలన్నారు, పశువుల సంతలో కొనుగోలు చేసిన పశువులను తీసుకొని వెళుతున్నట్లయితే వాటిని అమ్మినా వారి వివరాలు, సంబంధిత పశువైద్యాధికారి ధ్రువీకరించిన రవాణాకు అనుమతి పత్రాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రవాణా చేస్తున్న సమయంలో పశువులకు ఎలాంటి హాని తలపెట్టిన, హింసించిన అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పోలీసు, పశువైద్య డాక్టర్లచే వాహనాల తనిఖీలు చేపట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటారని తెలిపారు. పండగలు పూర్తయ్యేవరకు అదనంగా పెట్రోలింగ్ వాహనాలను మోహరించి జిల్లా అంతటా నిఘా పెట్టినట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని జిల్లా యంత్రాంగం తో కలిసి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారస్తులు పోలీసుల సలహాలు సూచనలు పాటించి శాంతిభద్రతలకు సహకరించాలని కమిషనర్ సూచించారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు సమిష్టిగా పనిచేయాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు

ఖమ్మం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులందరితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు మాట్లాడుతు నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేస్తే ఆర్థికంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయ్యే ప్రమాదం వుంటుంది కాబట్టి నకిలీ విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకొవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా విత్తనాల కొరత లేదనే విషయాన్ని రైతులకు భరోసా కల్పిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా పకడ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే అక్రమ రవాణా నియంత్రణకు జిల్లాలో ఏడు చెక్ పోస్ట్ ల ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయించి, రైతులకు నష్టం కలిగేలా వ్యవహరించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొవాలని సూచించారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ, కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ లో టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుండాలని పెర్కొన్నారు. అలాగే తనిఖీల సమయంలో వీడియోగ్రాఫీ చేయడం ద్వారా ఎవిడెన్స్, అధారంగా వుంటుందని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్ధానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడిఏలు శ్రీనివాస్ ,నరసింహారావు,విజయచందర్,కరుణశ్రీ,శ్రీనివాస్ రెడ్డి, ఏవో కిషోర్, సిఐ స్వామి పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడల పై దృష్టి సారించాలి

## మంథని సీ.ఐ ఎన్.వెంకటేశ్వర్లు

కమాన్ పూర్: విద్యతో పాటు క్రీడలపై విద్యార్థులు దృష్టిసారించాలని మంథని సీఐ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి స్టేడియంలో స్థానిక అండర్-14 చిన్నారుల మధ్య స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ ను ఆయన ప్రారంభించారు. ప్రతి విద్యార్థి జీవితంలో విద్యకు ఎంత ప్రాధాన్యమిస్తాడో , అదే తరహాలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక శ్రమ లభిస్తుందని, ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. అండర్-14 'ఏ' జట్టు, 16 ఓవర్లలో 186/3 పరుగులు చేయగా, 'బీ' జట్టు182/7 పరుగులు సాధించింది. ఈ కార్యక్రమంలో రామగిరి ఆర్ఎంపీల సంఘం అధ్యక్షులు డాక్టర్ బొద్దుల జగన్, సూదుల ఐలయ్య, సంగెం రాజేందర్, పార్థు, పీవీరావు, తిరుపతి రెడ్డి, బొడిగే శ్రీధర్, తన్నీరు ప్రదీప్, కెప్టెన్లు పల్లెసాక్షిత్ రావు,పుల్లెల సంప్రీత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామి...

హైదరాబాద్: హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ వేదికగా జరుగుతున్న ప్రపంచ వరి సదస్సును వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. రెండు రోజులు జరగనున్న ఈ సదస్సులో భారత్‌తో పాటు 30 దేశాలు పాల్గొననున్నాయి. శాస్త్రవేత్తలు, రైల్ వి?ల్లర్ సంఘాల ప్రతినిధులతో పాటు 250 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. భారత్‌లో వరిసాగు, ఉత్పత్తి, నాణ్యత విదేశీ ఎగుమతుల పెంపుపై చర్చలు జరపనున్నారుఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అని అన్నారు. ఇటీవలే దశాబ్ధి ఉత్సవాలు కూడా జరుపుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో రైస్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.2 ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు. ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారుకాంగ్రెస్ ప్రభుత్వం రైతు అనుకూల రాష్ట్రం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా అన్ని రకాలుగా రైతులకు మద్దతు ఇస్తుందని వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు సేకరిస్తుందని అన్నారు. వివిధ పథకాల క్రింద పౌష్టికాహారం కోసం పోర్టిఫికేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారురాష్ట్రంలో 3 వేల అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని తెలిపారు.

తెలంగాణలో నీటి పారుదల వనరులు కూడా పెరుగుతున్నాయని వెల్లడించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులను అందించడంతో పాటు ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నామని అన్నారు. దేశానికే తెలంగాణ ధాన్యాగారంగా మారిందన్నారు. తమ సర్కార్ వ్యవసాయానికి అన్ని రకాలుగా మద్దతు ఇస్తోందని తెలిపారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను ఈనెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి

సిద్దిపేట: కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీర్లు మరియు విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద జిల్లాలో 814 పాఠశాలలలో విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు మరియు ప్రహరీ గోడల మరమత్తు పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ఇంకా 5 రోజుల సమయం మాత్రమే ఉన్నా ఇప్పటికీ 176 పాఠశాలలలో నిర్మాణ పనులు పూర్తయి మిగతా పాఠశాలలలో చేపట్టిన పనులు కాకపోవడంపై పంచాయతీరాజ్ మరియు ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేసి నిర్మాణం చివరి దశలో ఉన్న పాఠశాలలలో రంగులు పూర్తిచేసి 12 లోగా అందించాలని అలాగే మిగతా పాఠశాలలో ఈనెల 20వ తేదీలోగా 100% పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. 32 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా ఇప్పటికీ 8 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగిందని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపట్టి నిర్మాణ ప్రగతి సరిగా లేని పాఠశాలలను మరియు అసలే పనులు ప్రారంభించని పాఠశాలలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో కలిసి సందర్శించి త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ



అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. సోమవారం అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంఈఓ లు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఐకెపి వివోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇలు, డిఇలు, ఎఇలు, ఈడబ్ల్యూఐడిసి ఇఇ, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు

## -డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## -మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి

మంథని: పారిశుద్ధ్యం విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి అన్నారు.

మంథని మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో పారిశుద్ధ్యం కి సంబంధించిన పలు సమస్యలు తమ దృష్టికి రావడంతో వార్డులు తిరుగుతూ తమ సిబ్బందితో పారిశుద్ధ్యనికి సంబంధించిన సమస్యలను దగ్గరుండి పరిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇంట్లోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా వార్డులలో తిరిగే చెత్త బండ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. 9వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం స్థానిక కౌన్సిలర్ తో కలిసి పర్యవేక్షించారు. డ్రైనేజ్ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో నీటి సరఫరాకు సంబంధించిన పైప్ లైన్లు చెడిపోవడంతో వాటిని వెంటనే పునరుద్ధరించి నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూడాలనీ రానున్న రోజుల్లో వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణా పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో క్యాన్సర్ కు అరుదైన చికిత్స

## క్యాన్సర్ స్పెషలిస్ట్ , రోబోటిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ గౌడ్

ఖమ్మం: హైదరాబాద్ హైటెక్ సిటీ లోని యశోద హాస్పిటల్ లో క్యాన్సర్ కు అరుదైన చికిత్స చేసినట్లు ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ , రోబోటిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ గౌడ్ పేర్కొన్నారు . ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది బాబుకు చేసిన అరుదైన చికిత్స గురించి వివరించారు . ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన షేక్ అబ్దుల్ ఇషాక్ అనే ఏడాది బాబుకి కడుపు నొప్పి, బరువు పెరగకపోవడం , విరేచనం కాకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుండడంతో అతని తల్లిదండ్రులు పలు హాస్పిటళ్లకు తిరిగి చివరకు తమ వద్దకు వచ్చారన్నారు . బాబుకు పరీక్షలు నిర్వహించగా కడుపులో 2.5 కేజీల కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనితో బయాప్సి చేయగా క్యాన్సర్ అని తేలిందిన్నారు . కాంప్ర హెన్సివ్ క్యాన్సర్ కేర్ విత్ పర్సనలైజ్డ్ ట్రీట్మెంట్ లో భాగంగా కీమో థెరపీ చేసి కణితి ని కరిగించి అడ్వాన్స్ టెక్నాలజీ సహాయంతో బ్లాడర్ వాల్ తో కణితి ని రిమూవ్ చేసినట్లు తెలిపారు . అదే విధంగా యూరిన్ , మోషన్ కెళ్లే నరాలను ప్రిజర్వ్ చేసి సర్జరీ చేయడంతో రోగి కొలుకున్నట్లు తెలిపారు . రెండు రోజుల్లోనే డిస్చార్జి చేశామన్నారు. ఇప్పుడు బాబు నార్మల్ గానే యూరిన్ కెళున్నాడని , ఇబ్బంది లేదని తెలిపారు. ఎటువంటి క్యాన్సర్ కైనా యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ బ్రాంచ్ లో వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు . ముందుగా నే క్యాన్సర్ ను గుర్తించడం ద్వారా అడ్వాన్స్ టెక్నాలజీ వైద్యం ద్వారా తగ్గించవచ్చని తెలిపారు . ఉన్నతమైన వైద్యం ఇప్పుడు తమ హాస్పిటల్ లో అందుతోందన్నారు . ఈ సమావేశంలో రోగి తల్లిదండ్రులు పాల్గొన్నారు .

# టీబీ నివారణ కు టీకా పై అధ్యయనం

జయశంకర్ భూపాలపల్లి, పెద్దలలో టీ బీ నివారణకు బీసీజీ టీకాపై అధ్యయనం జరుగుతున్నట్టు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో అడల్ట్ టీబి వ్యాక్సినేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు. 2025నాటికి మన దేశంలో క్షయ వ్యాధి ని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు 18సంవత్సరాలు పై బడిన వారందరికీ క్షయవ్యాధి నివారణ టీకాలు వేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 18సంవత్సరాలు పై బడిన వ్యక్తులు, గత 5సంవత్సరాల్లో క్షయ బారిన పడిన వారు, వారి కుటుంబ సభ్యులు, పొగ తాగిన వారు, 60సంవత్సరాలకుపై బడిన వారు, హెచ్ ఐ వీ, మధు మేహ వ్యాధి గ్రస్తులు, శారీరకంగా, బలహీనంగా ఉన్న వారు ఈ వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులు అని చెప్పారు. ఈ టీకాల ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు ఉండవన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఈ టీకా ని మొదటగా రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నారన్నారు. బీ సీ జీ వ్యాక్సిన్ అధ్యయన కార్యక్రమం(పైలట్ ప్రాజెక్ట్) కోసం తెలంగాణ రాష్ట్రంలో 17 జిల్లాలని ఎంపిక చేయగా అందులోభూపాలపల్లి జిల్లా ఒకటన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం పీహెచ్ సీ, బస్తీ దవాఖాన,పల్లె దవాఖాన వైద్యులకు,సూపర్ వైజర్ లకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డబ్లు హెచ్ ఓ కన్సల్టెంట్ ఎన్ఈపిటి"శ్రీగణ,డా "ప్రశాంత్, "బిందు భార్గవి స్టేట్ ఎన్ఈపిటి పి ఓ, డా"పనిందర్, డిప్యూటీ డిఎంహెచ్వో డా"కొమురయ్య , పిఓ డా"ఉమాదేవి, డా "ప్రమోద్, ఎంఓ లు, ఎమ్మెల్యే హెచ్ పిలు,సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంను ఎలా ఉపయోగించుకోవాలి?

హైదరాబాదు: చట్టాలు ప్రజలకు ఉపయోగపడాలి. ఆ విధంగా వాటిని అమలు చేసే వ్యక్తులు క్రియాత్మకంగా వ్యవహరించాలి. లేకపోతే ఆ చట్టము లక్ష్యం నెరవేరదు. అది నిర్వీర్యం అవుతుంది. పౌరులకు ఆచరణయోగ్యమైన సమాచార హక్కు కల్పించి, తద్వారా ప్రతి అధికార యంత్రాంగము దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులకు అందుబాటులోకి తెచ్చేందుకు, పౌరులకు ఉన్న సమాచార హక్కును చట్టబద్ధం చేసి, ప్రతి ప్రభుత్వం యంత్రాంగములో పారదర్శకత, జవాబుదారీ తనము తీసుకురావడం ఈ చట్టం ఉద్దేశ్యము అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. సమాచార హక్కు చట్టంలోని 7(6) ప్రకారము అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైనప్పుడు ఫీజుతో నిమిత్తం లేకుండా ఆ సమాచారాన్ని ఉచితంగా ప్రజా సమాచార అధికారి అందించాల్సి ఉంటుంది. ఆ ఫీజు సహేతుకంగా ఉండాలి. దారిద్య రేఖకు దిగువన ఉన్నవారి నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదు అని సాయి చౌదరి తెలిపారు. అంతేకాదు సెక్షన్ 7(3) ప్రకారం సమాచారం అందించడానికి ఎక్కువ మొత్తం వసూలు చేయాలని నిర్ణయించినప్పుడు ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియ జేయాలి. ఆ ఫీజును మరొకసారి పరిశీలన చేయుమని కోరే హక్కు దరఖాస్తుదారునికి ఉందని, అందుకున్న కాలపరిమితిని, అనుసరించాల్సిన పద్ధతులను, అప్పీలును ఎవరి ముందు దాఖలుచేయాలో ఆ వివరాలను కూడా తెలియజేయాలి. సెక్షన్ 7(9) ప్రకారం కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారుడు అడిగిన రూపంలోనే అందించాలి. ఆ విధంగా కాకుండా వేరే విధంగా కూడా సమాచారాన్ని ఇచ్చే అధికారము ప్రజా సమాచార అధికారి ఉంటుంది. వనరులు ఎక్కువ ఖర్చుయ్యే సందర్భంలో ఆ విషయాన్ని తెలియజేస్తూ, తక్కువ ఖర్చు అయ్యే విధంగా మరో రూపంలో ఇచ్చే అవకాశం ప్రజా సమాచార అధికారికి ఉంటుంది. ఈ చర్యలేవి తీసుకోకుండా కొన్ని వేల రూపాయల్లో, కొన్ని లక్షల రూపాయలు డబ్బు చెల్లించాలని చెప్పడం సమాచారాన్ని కోరుతున్న వ్యక్తులను నిరుత్సాహపరచడమే అవుతుంది. మరో విధంగా చెప్పాలంటే బెదిరించడం అవుతుంది. సంబంధంలేని సమాచారం ఇవ్వకుండా సంబంధించిన సమాచారం ఇస్తే అంత మొత్తం అవసరం ఉండదు. దరఖాస్తులు జాగ్రత్తగా గమనించి అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించవచ్చు. కానీ ఆ అధికారులు ఉద్దేశం మరో విధంగా ఉన్నప్పుడు ఇలాంటి చర్యలనే వాళ్ళు తీసుకుంటారు. ఇలాంటి చర్యలు ఎండగట్టాలంటే సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన ఉండాలి. చట్టంలోని నిబంధనలను అర్థం చేసుకుంటే ప్రజా సమాచార అధికారులు తీసుకునే ఎలాంటి చర్యలనైనా అధిగమించే పరిస్థితి ఏర్పడుతుంది. సమాచారాన్ని ఎవరైనా కోరవచ్చు. ఎందుకు కోరుతున్నారో కారణం కూడా తెలియజేయాల్సిన అవసరం లేదు. దారిద్యరేఖకు దిగువన ఉన్న వ్యక్తులు సమాచారం పొందటానికి ఎలాంటి చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ విషయములను అర్థం చేసుకుంటే అన్ని ఆటంకాలను అధిగమించే అవకాశం ఉంటుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి వివరించారు. ప్రజలు ప్రభుత్వ చర్యల్లో పాల్గొనడం వల్ల ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఎన్నికలు అప్పుడు మాత్రమే కాదు, రోజు వారి ప్రభుత్వ కార్యకలాపాల్లో పౌరులు పాల్గొనాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాలసీలు, స్కీముల అమలు సక్రమంగా జరుగుతున్నవా అనే విషయం పరిశీలించాలి. ఇవి చేయాలంటే చట్టం పట్ల అవగాహన ఉండాలి. ఆ ప్రయత్నం అందరూ చేయాలి అని సాయి చౌదరి అన్నారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో ఉద్యోగాలు

హైదరాబాద్: హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఖాళీలను డిప్యూటేషన్ విధానంలో భర్తీచేయనున్నారు. పోస్టులవారీగా విద్యార్హతలు నిర్ణయించారు. బీటెక్, ఎంటెక్, ఎంసీఏ విద్యార్హతతోపాటు సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది నుంచి 5 సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరఖాస్తుకు అర్హులు. సరైన అర్హతలు, అనుభవవం ఉన్నవారు ఆఫ్‌లైన్ విధానంలో జూన్ 20లోగా దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుకు నింపి, అవసరమైన అన్ని డాక్యుమెంట్లను జతచేసి నిర్ణీత గడువులోగా సంబంధిత చిరునామాలో సమర్పించాలి. అర్హతలు, అనుభవం ఆధారంగా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపికచేస్తారు.

వివరాలు..

టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగాలు (డిప్యూటేషన్)

ఖాళీల సంఖ్య: 06.

- చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: ఎంటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: ఐటీ విభాగంలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 1,06,990 – రూ. 1,58,380.

- చీఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: ఎంటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: నెట్‌వర్క్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ విభాగంలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 1,06,990 – రూ. 1,58,380.

- సీనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 45,960 – రూ. 1,24,150.

- జూనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కనీసం ఏడాది పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 43,490 – రూ. 1,18,730.

- సీనియర్ ప్రోగ్రామర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: ప్రోగ్రామింగ్‌లో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 54,220 – రూ. 1,33,630.

- జూనియర్ అడ్మినిస్ట్రేటర్

పోస్టుల సంఖ్య: 01.

అర్హత: బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్).

అనుభవం: ప్రోగ్రామింగ్‌లో కనీసం 3 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: రూ. 42,300 – రూ. 1,15,270.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుకు నింపి, అవసరమైన అన్ని డాక్యుమెంట్లను జతచేసి హైదరాబాద్, ప్రతిభా భవన్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో సమర్పించాలి.

ఎంపిక విధానం: అర్హతలు, అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

# ఇక పాలన పై శ్రద్ధ...

హైదరాబాద్: ఎన్నికల కోడ్ ముగియటంతో తెలంగాణ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంశాలలో ప్రాధాన్యతల ఆధారంగా ఒక్కొక్క దాని మీదా ముఖ్యమంత్రి, మంత్రులు దృష్టి సారిస్తున్నారు. సామాన్యులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఉద్దేశించిన ప్రజావాణి కార్యక్రమాన్ని శుక్రవారం తిరిగి ప్రారంభించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో గతంలో వాయిదా పడిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ఒకటి రెండు రోజుల్లో సీఎం క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్యులకు మెరుగైన సేవలు అందేందుకు 5 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. అలాగే రైతు రుణమాఫీ, ధరణి వంటి అంశాలతో బాటు రూ. 850 కోట్లతో రాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం, రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల సరఫరా వంటి ప్రాధాన్యతా అంశాలపై ప్రభుత్వం వడివడిగా నిర్ణయాలు తీసుకోనుంది.రేవంత్ రెడ్డి సీఎం కాగానే.. ప్రజలు తమ సమస్యలు నేరుగా ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉన్న ప్రగతి భవన్‌ను ప్రజలకు అంకితం చేస్తూ దానికి జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజలు నేరుగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించారు. కోడ్ కారణంగా తిరిగి ఈ కార్యక్రమం శుక్రవారం నుంచి మొదలైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు క్యూలు కట్టి తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.తొలుత.. ఈ జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో శుక్రవారం ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో ఇప్పటికే అధికారులు బదిలీలు, ప్రమోషన్ల ఫైలును ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపటం, శుక్రవారం దానికి ఆమోదముద్ర పడటంతో షెడ్యూల్ విడుదలైంది. నిజానికి 2023 ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, పదోన్నతుల విషయంలో టెట్ నిబంధన తప్పనిసరి అంటూ హైకోర్టు తీర్పు రావటం, జీవో 317 కారణంగా ఇతర జిల్లాల టీచర్లు రాజధాని పరిధిలోని రంగారెడ్డి జిల్లాకే రావటం ఎక్కువ కావటంతో స్థానికులమైన తమకు నష్టం జరుగుతోందని ఇక్కడి టీచర్లు హైకోర్టును ఆశ్రయించటంతో అప్పట్లో ఈ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ అరాకొరాగా జరిగింది. తీర్పు వచ్చేనాటికి వివాదం లేని బదిలీలు, ప్రమోషన్లు మాత్రం పూర్తయ్యాయి. అసంపూర్తిగా మిగిలిన ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ఆరంభించి పూర్తిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో 6 వేలమంది సెకండ్ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనుండగా, 2400 మంది హెడ్మాస్టర్లు కానున్నారు. గతంలో హైకోర్టు ఇచ్చిన మరో తీర్పును అనుసరించి 8,630 మంది భాషా పండితులకు, 1,819 మంది పీఈటీలు కూడా ఈసారి స్కూల్ అసిస్టెంట్లు కానున్నారు.వైద్యవిద్య, వైద్యవిధానపరిషత్, ప్రజారోగ్యశాఖలో 5348 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని రెండున్నర నెలల క్రితమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించగా, ఈ ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతి కూడా లభించింది. అయితే, కోడ్ కారణణంగా ఇది నిలిచిపోయింది. వైద్య, ఆరోగ్యసేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా పోస్టులు భర్తీ కానున్నాయి. కొత్త వైద్యకళాశాలలు రావడంతో పాటు వైద్య, ఆరోగ్య సేవలు జాప్యం లేకుండా పూర్తిస్థాయిలో అందించాలని జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) నిబంధనలు కఠినతరం చేయడంతో ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ ఉద్యోగాల భర్తీని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ మొత్తం ఉద్యోగాల్లో 3235 పోస్టులు వైద్యవిద్య డైరెక్టరేట్ పరిధిలో ఉండగా, మిగిలిన 2,113 ఉద్యోగాలు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వైద్య విధాన పరిషత్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ఔషధ నియంత్రణ మండలి (డీసీఏ), ఆయుష్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి పరిధిలో ఉన్నాయి. వీటిలో 1610 వైద్యుల పోస్టులు, 596 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1014 సివిల్ అసిస్టెంట్ సర్జెన్లు, 764 ల్యాబ్ టెక్నీషియన్, 191 ఫార్మసిస్టులు, 85 ఏఎన్ఎంల పోస్టులున్నాయి.పంద్రాగస్టులోగా ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసే దిశగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో సుమారు 30 లక్షల మందికి పైగా రుణమాఫీ చేయాల్సి ఉండగా, సగటున దీనికి రూ. 35 వేల కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పిటికే తమ ఆలోచనను ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకురావటమే గాక రుణమాఫీ కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. ముందుగా బ్యాంకులను ఒప్పించి, వారి రుణాలను ప్రభుత్వ ఖాతాకు బదలాయించి, బ్యాంకుల నుంచి రుణమాఫీకి సరిపడా మొత్తాన్ని తీసుకుని, ఆ బాకీని వడ్డీతో సహా నెలవారీ కిస్తీలుగా కట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా వచ్చే ఆదాయాపు లెక్కలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా, తెలంగాణలోని మొత్తం వ్యవసాయ భూమిలో దాదాపు 45 శాతం మేర సాగులోనే లేదని, అయినా రైతుబంధు సాయాన్ని గత ప్రభుత్వం విడుదల చేసిందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఈ వృధాను అరికట్టటం, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు అందించాల్సిన పంట సాయం, సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు, సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్ల మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించనుంది.రైతులు పండించే పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రేషన్ దుకాణాల ద్వారా వాటిని తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. కేసీఆర్ హయాంలో బియ్యంతో బాటు ఒకటి రెండు సరకులకే పరిమితం కాగా, గత కాంగ్రెస్ ప్రభుత్వాల మాదిరిగి వీలున్నన్ని ఎక్కువ నిత్యావసరాలను సరఫరా చేయాలని, తద్వారా సామాన్యులపై నిత్యావసరాల భారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. దీనిపై పౌరసరఫరా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఇందులో భాగంగానే ఇవాళ సెక్రటేరియట్‌లో ధరణి కమిటీ సమావేశం జరగనుంది. గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణిని రద్దుచేసి, భూరికార్డులను పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 'భూమాత' అనే వ్యవస్థను తీసుకురానుంది. దీనిపై పార్లమెంటు ఎన్నికలు ముగిసిన రెండవ రోజే ముఖ్యమంత్రి సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలోని సుమారు 436 కిలోమీటర్ల మేర ఉన్న రాష్ట్ర రహదారులను చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్ఐఎఫ్) కింద కేంద్రం గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేటాయించిన రూ.850 కోట్ల నిధులు బదిలీ అయినా.. అసెంబ్లీ ఎన్నికల హడావుడి, ఆ తర్వాత లోక్‌సభ కోడ్ కారణంగా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అయితే, అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను పరిశీలించిన ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో ప్రతి జిల్లాకూ సగటున రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు నిధులు దక్కనున్నాయి. జూన్ చివరికి టెండర్లు ఖరారుచేసి గుత్తేదారులతో ఒప్పందం చేసుకుని వేగంగా పనులు ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## సిద్దిపేట జిల్లాలో రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా

సిద్దిపేట: సిద్దిపేటలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. సినిమా స్టైల్లో కొరియర్ కంటైనర్ లో అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్నారు. దుబ్బాక (మం) మర్రికుంట వద్ద డివైడర్ ని ఢీ కొట్టి కొరియర్ వాహనం బోల్తా పడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి డ్రైవర్ పారిపోవడంతో అనుమానం వచ్చి కంటైనర్ డోర్లు ఓపెన్ చేయగా రేషన్ బియ్యం కంటపడింది. కొరియర్ మాటున రేషన్ బియ్యం తరలిస్తుండటంతో షాక్ అయిన పోలీసులు...నిందితుల కోసం గాలిస్తున్నారు.

## జూనియర్ సివిల్ జడ్జీ పరీక్షలకు శిక్షణ తరగతుల ప్రారంభం

హైదరాబాద్: జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలు ఉచిత శిక్షణ తరగతులను సిటీ సివిల్ కోర్టు జడ్జి శ్రీధర్.హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. మలక్ పేట కళ్యాణ్ నగర్ లో స్వర్గీయ రాపోలు రాజ్య లక్ష్మీ. రాములు స్మారకర్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. చట్టాలపై పట్టు సాధిస్తే న్యాయ వాది వృత్తిలో రాణించ గలుగుతారని తెలిపారు. ఔత్సా హిక ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థు లకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తెలిపారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ నెల 23 ప్రవేశ పరీక్షలో ఉందని వివరించారు. నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

## కారు దిగడానికి మరి కొందరు ఎమ్మెల్యేలు

హైదరాబాద్: కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ కొలువు తీరబోతోంది. ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవనున్నారు. తెలంగాణలోని లోక్సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నానే మిగిలింది. ఏపీలోనూ కేసీఆర్ దోస్త్ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్ల సంఖ్య అటుంచితే.. చెప్పుకోదగ్గ స్థానాలను కూడా వైసిపి సాధించలేదు. దీంతో ఈ మొత్తం వ్యవహారంలో ఎటు చూసినా..బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు పెద్ద మైనస్ గా మారింది. వాస్తవానికి తెలంగాణలో కొన్నైనా లోక్సభ స్థానాలను గెలుచుకుంటామని గులాబీ అధినాయకత్వం అంచనా వేసుకుంది. తద్వారా కేంద్రంలో తాము చక్రం తిప్పేందుకు ఆస్కారం ఉంటుంది ఆ పార్టీ ఎక్స్పెక్ట్ చేసింది. ఒకవేళ రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో లోక్సభ స్థానాలు రాకున్నా..ఏపీలో తన మిత్రుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవతారని భావించింది.పై కారణాలు చెప్పే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇన్నాళ్లు తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోగలిగారు. ఆంధ్రాలో జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే తమకు కాస్త రిలీఫ్ ఉంటుందని లేదా తెలంగాణ లో ఎక్కువ లోక్సభ స్థానాలను గెలుచుకున్నా?తమకు ఢోకా ఉండదని వారికి నచ్చ చెప్పుకున్నారు. అయితే ఇవేవీ వర్కౌట్ కాకపోవడంతో.. ఇప్పుడు తెలంగాణ భవన్ నుంచి ఒక్కొక్కరు కాంగ్రెస్ లేదా బిజెపి వైపు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే మాజీమంత్రి మల్లారెడ్డి,ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితులు వేం నరేందర్ రెడ్డితో సంప్రదింపులు జరిపి ఆ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అలాగే వీరి బాటలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు కూడా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. వాస్తవానికి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా గులాబీ పార్టీ గ్రేటర్ లోనే అత్యధిక స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు ఇక్కడి నుంచే ఎమ్మెల్యేలు కారు దిగేందుకు సిద్ధపడటం కేసీఆర్ ను ఆందోళనకు గురిచేస్తుంది.ఇక పార్టీ మారే విషయంలో కెసిఆర్ కు మల్లారెడ్డి,రాజశేఖర్ రెడ్డి,సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశారు. తాము కాంగ్రెస్ లోకి పోవడం తప్ప మరో మార్గం లేదని తేల్చి చెప్పేశారు. ఇదే విషయం బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాక వీరితోపాటు మరి కొంతమంది ఎమ్మెల్యేలు కారు దిగిపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో వెంటనే అలర్ట్ కెసిఆర్ మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి,లక్ష్మారెడ్డి,సుధీర్ రెడ్డిలను ఫాంహౌజుకు పిలిపించుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వారి నుంచి సానుకూల దృక్పథం రాకపోవడంపై కెసిఆర్ కొంత అసహనానికి గురైనట్లు తెలుస్తుంది. అయితే వీరి పార్టీ మార్పును అడ్డుకునేందుకు కెసిఆర్ ఆ నలుగురు ఎంఎల్ఏలతో దిగిన ఫోటోను కావాలనే వైరల్ చేయించినట్లు టాక్. తద్వారా వీరు పార్టీ మారడం లేదనే సంకేతాలను పంపే ప్రయత్నం చేసినట్లు అర్థమవుతుంది. అయితే కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. మెజార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం కారు దిగడం ఖాయమనే ప్రచారముంది.

## పార్టీలు మారినా... మారని తలరాతలు

వరంగల్: ఎన్నికలు రాగానే మొదట టికెట్ కోసం ఎదురుచూస్తారు, ఛాన్స్ లేదనుకుంటే చాలు ఆ పార్టీపై విమర్శలు, ఆరోపణలు చేసి మరో పార్టీలోకి జంప్ అవుతుంటారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ముందు తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ లోకి మారి టికెట్ దక్కించుకొన్న కొందరు నేతలు ఓటమి పాలయ్యారు. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కొందరు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరికొందరు సిట్టింగ్ ఎంపీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన నేతలు ఎన్నికల్లో పోటీ చేయగా ఒకే ఒక్కరు విజయం సాధించారు. మిగతా వారికి మాత్రం నిరాశే మిగిలింది. గెలిచిన ఆ ఒక్క అభ్యర్థి వరంగల్ ఎంపీ కడియం కావ్య. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నేతలను ఆ పార్టీ ఈ పార్టీ నేతలు అని చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని దుస్థితి. అధికార పార్టీలో ఉంటే నాయకులు ప్రతిపక్ష పార్టీలో ఉంటే నాయకులం కాదు. అనే విధంగా రాజకీయ నాయకుల వ్యవహార శైలి మారింది. ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న అధికారానికి దూరమైన కొద్ది రోజులకే నేతలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారు. ఇలాంటి పరిస్థితి మొన్నటి లోక్‌సభ ఎన్నికల ముందు జరిగింది. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. అంతే కాదు సీట్లు దక్కించుకుని పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేశారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన వారిలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఆయన భార్య సునీతా మహేందర్ రెడ్డి, స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కడియం కావ్య ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ నుంచి, సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉన్న దానం నాగేందర్ సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి, పట్నం సునీతా మహేందర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి, కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే పార్టీ మారినా వారి ఫేట్ మాత్రం మారలేదు. అధికార పార్టీలో ఉంటే విజయం తథ్యమని భావించిన ఈ నేతలకు నిరాశే ఎదురైంది. చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతిలో రంజిత్ రెడ్డి ఓటమి చెందారు.మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన సునీతా రెడ్డి.. ఈటల రాజేందర్ చేతిలో 3,91,475 ఓట్ల తేడాతో గెలుపొందారు. సికింద్రాబాద్‌లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ కిషన్ రెడ్డి చేతితో 49,944 ఓట్ల తేడాతో దానం నాగేందర్ కు ఓటమి తప్పలేదు. అయితే పార్టీ మారిన వారిలో వరంగల్ లో కడియం కావ్య ఒక్కరే విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పై 2,20,339 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఇక్కడ ప్రత్యర్థి అంత స్ట్రాంగ్ కాకపోవడంతో కావ్య గెలుపొందారని వినిపిస్తోంది. అధికారం కోసం రాత్రికి రాత్రి పార్టీలు మారినా, ఎన్నికల్లో ఓటు వేయకుండా వారిని ప్రజలు ఓడించి ఇంటికి పంపినట్లు అయింది.

## కొత్త సీఎస్, డీజీపీ...?

హైదరాబాద్: తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రజాపాలనపై ఫోకస్ పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం.ఇందులో భాగంగానే అత్యంత కీలకమైన పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. కొత్త టీంను సెట్ చేసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేశారని, ఐపీఎస్ అధికారుల బదిలీలు పెద్ద సంఖ్యలో జరిగే ఛాన్స్ ఉన్నట్టు టాక్. డీజీపీ, పలువురు పోలీస్ కమిషనర్లు సహా పలు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు స్థాన చలనం తప్పదనే చర్చ జోరుగా నడుస్తోంది. కీలక బాధ్యతల్లో కొత్త అధికారులను నియమించడంతో పాటు ఇప్పటికే ఒకటికి మించి అదనపు పోస్టులతోపని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించే ఛాన్స్ ఉంది. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేసే చాన్స్ ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం డీజీపీ హెచ్ఓపీఎఫ్ హెడ్ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా ఉన్న రవిగుప్తా స్థానంలో కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, జితేందర్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం డీజీ ర్యాంకులో ఉన్న సీవీ ఆనంద్ అత్యంత కీలకమైన ఏసీబీ డీజీ పోస్టులో ఉన్నారు. డీజీ ర్యాంకు లో ఉన్న మరో అధికారి జితేందర్ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు.అయితే ప్రభుత్వం మాత్రం సీనియర్ ఐపీఎస్ శివధర్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అడిషనల్ డీజీ ర్యాంకులో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డిని ఇటీవల ఏర్పడిన రెండు డీజీపీ ర్యాంకు ఖాళీల భర్తీలో భాగంగా పదోన్నతి ఇచ్చి పోలీస్ బాస్‌గా నియమించే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం డీజీపీ ర్యాంకులో నలుగురు సీనియర్ ఐపీఎస్‌లు కొనసాగుతున్నారు. వీరిలో రవిగుప్తాతో పాటు అసెంబ్లీ ఎన్నికల రిజల్ట్స్ టైంలో అనూహ్యంగా రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ అయిన అంజనీకుమార్, సీవీ ఆనంద్, జితేందర్ ఉన్నారు. డీజీపీ ర్యాంకులోనే విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్‌రతన్ గుండెపోటుతో హఠాన్మరణం పాలయ్యారు. అదేవిధంగా టీఎస్ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేసిన సందీప్ శాండిల్య కొద్దిరోజుల క్రితం పదవీ విరమణ పొందారు. ఇలా రెండు డీజీపీ ర్యాంకులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డిలకు డీజీపీలుగా పదోన్నతి లభించే ఛాన్స్ ఉంది.కరీంనగర్ పోలీస్ కమిషనర్ మొహంతి, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్‌జా, రామగుండం సీపీ శ్రీనివాసులుకు స్థాన చలనం కలిగే ఛాన్స్ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇంటిలిజెన్స్ ఏడీజీ పోస్టులో ఉన్న శివధర్‌రెడ్డికి డీజీపీగా బాధ్యతలు అప్పగిస్తే ఆ స్థానంలోకి మరో సీనియర్ ఐపీఎస్ అధికారి రమేశ్‌రెడ్డి వెళ్లే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం అడిషనల్ డీజీగా ఉన్న శిఖా గోయల్ వద్ద కీలక పోస్టులైన సీఐడీ, మహిళా భద్రత విభాగం, టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఇతర ఐపీఎస్‌లకు అప్పగించనున్నారు.

## ఆ ఇద్దరు ఎవరు...?

హైదరాబాద్: గతంలో నాలుగు సీట్లు ఉన్నాయి. ఒక్కటి అదనంగా గెలిచినా చాలు.. అది మాకు బోనస్సే.. ఇది లోక్‌సభ ఎలక్షన్స్ ముందు బీజేపీ నేతల మాటలు.. బట్ ప్రజలు మాత్రం వారి అంచనాలకు మించి సీట్లు ఇచ్చారు. ఏకంగా ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులను గెలిపించారు. మరి ఇది తెలంగాణకు మంచి చేయబోతుంది? గెలిచారన్న సంతోషమేనా? మరి మనకు జరిగే లాభం ఏమైనా ఉందా? ప్రజలు ఆశీర్వదించారు.. మేము అనుకున్నదానికంటే చాలా బాగా పోరాడాము.. ఇవి తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి చెబుతున్న మాటలు.. యస్.. నిజంగానే మొత్తం 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో బీజేపీ ఈ స్థాయిలో సీట్లు గెలుచుకోవడం ఇదే ఫస్ట్ టైమ్.. మరి తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇస్తుంది? రాష్ట్రానికి ఏం మేలు చేస్తుంది? ఇదే ఇప్పుడు మెయిన్ క్వశ్చన్.లాస్ట్ లోక్‌సభ ఎలక్షన్స్‌లో తెలంగాణలో నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకుంది. ఇప్పటి బీఆర్ఎస్.. అప్పటి టీఆర్ఎస్ హవా నడుస్తున్న సమయం అది. ఆ హవాలో కూడా అనూహ్యంగా నాలుగు ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది బీజేపీ. దీనికి ప్రతిఫలంగా ఒక కేంద్ర సహాయమంత్రి పదవిని కల్పించింది అప్పటి మోడీ సర్కార్.. బస్.. అంతే.. అంతకుమించి రాష్ట్రానికి జరిగిన వృద్ధి ఏం లేదనేది ఇప్పటికీ ఉన్న విమర్శలు. ప్రాజెక్టులు, నిధుల విషయంలో కూడా కేంద్ర నుంచి తెలంగాణకు ఒరిగిందేం లేదన్న టాక్ ఉంది. కానీ ఈసారి సిట్యూవేషన్ వేరు. కాస్త అన్యాయం జరిగిందని ప్రచారం జరిగినా.. తెలంగాణ ప్రజలు దానిని పక్కన పెట్టారు. బీజేపీకి జై కొట్టారు.. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించారు. మరి ఈసారైనా న్యాయం జరుగుతుందా? తెలంగాణ బీజేపీ ఎంపీలకు కీలకమైన మంత్రిత్వశాఖలు దక్కుతాయా?ఇప్పుడు దీనిపైనే తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ డిబేట్ నడుస్తుంది..అయితే ఈసారి నలుగురికి మంత్రి పదవులు దక్కుతాయన్న చర్చ నడుస్తుంది. నిజానికి బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ ఎంపీలుగా గెలవడం ఇది రెండోసారి.. సో.. వీరిద్దరు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. తొలిసారి విజయం సాధించిన డీకే అరుణ, ఈటల రాజేందర్ కూడా మంత్రి పదవి రేసులో ఉండే చాన్స్ ఉంది. గతంలోనే కిషన్ రెడ్డి మంత్రి పదవి దక్కించుకున్నారు కాబట్టి.. ఆయనకు ఈసారి మళ్లీ పదవి ఇస్తారా? లేదా? అనేది డౌట్.. బీసీ కోటాలో ఈటలకు లేదా బండి సంజయ్‌కు.. మహిళా కోటాలో డీకే అరుణకు పదవీయోగ్యం దక్కే చాన్స్ ఉంది.అయితే బీజేపీకి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోవడం చాలా మంది ఆశావాహులకు దెబ్బ అనే చెప్పాలి. ఎందుకంటే బీజేపీ మిత్ర పక్షాలు డిమాండ్స్ పెరిగిపోయాయి. తమకు కావాల్సిన మంత్రి పదవులు ఇన్ని.. శాఖలు ఇవి..అంటూ చాంతాడంతా లిస్ట్‌ను బీజేపీ పెద్దల ముందు ఉంచుతున్నారు. సో.. ఎక్కువ సంఖ్యలో మంత్రి పదవులు మిత్ర పక్షాలకు వెళితే.. చాలా వరకు బీజేపీ ఆశావాహులకు పదవులు దక్కే అవకాశం ఉండకపోవచ్చు. అందులో తెలంగాణ బీజేపీ ఎంపీలు ఉండే అవకాశం కూడా లేకపోలేదు.అయితే మోడీ సర్కార్ చాలా విషయాల్లో తెలంగాణకు మొండి చేయ్యే చూపించిందని చెప్పాలి. ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామన్నారు. దానిని నాన్చి నాన్చి.. చివరకు మరమ్మతుల కేంద్రంగా మార్చేశారు. అది కూడా ఎన్నికల ముందు ప్రకటించారు. ఇక నిజామాబాద్ పసుపు బోర్డు కూడా.. ఐదేళ్లు నాన్చి నాన్చి.. దానిని కూడా సరిగ్గా ఎన్నికల ముందు అనౌన్స్ చేశారు. బయ్యారం ఉక్కు

## ఐవీఎఫ్ చికిత్సకు వెళ్లిన వివాహిత మృతి

హైదరాబాద్: సంతానం కొరకు ఐవీఎఫ్ ట్రీట్మెంటుకు వెళ్లిన ఓ మహిళ, వైద్యుల నిర్లక్ష్యంతో మృత్యువాత పడిన సంఘటన కె.పి.హెచ్.బి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట కుందన్బాగ్ కు చెందిన కరుణాకర్, భార్య మేరీ పరిణిత(38) సంతానం కలగకపోవడంతో కె.పి.హెచ్.బి కాలనీలోని డా.నీరజ ఫెర్టిలిటీ సెంటర్ ను సంప్రదించారు. ఐవీఎఫ్ ట్రీట్మెంట్ అందిస్తున్న డా.నీరజ వల్లి, గత నెల 31 వ తేదీన ప్రసాద్ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ లో ఐవీఎఫ్ ప్రక్రియ ఉందంటూ చికిత్స మొదలుపెట్టి, పరిణితికి హార్ట్ ఎటాక్ వచ్చిందని చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తరలించాలని నర్స్ తెలపటంతో హుటాహుటిన హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త కరుణాకర్ రెడ్డి అంత్యక్రియల అనంతరం డా.నీరజను సంప్రదించి తన. భార్య మరణానికి కారణం అడగగా, ఆమె బేరసారాలు మొదలు పెట్టడటంతో, కరుణాకర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి గాంధీ ఆసుపత్రి వైద్యులు శవపరీక్ష నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు, మెడికల్ ఫైల్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని కె.పి.హెచ్.బి సిఐ తెలిపారు.

# అయ్యో పాపం.. టీ20 ప్రపంచకప్ 2024 నుంచి పాకిస్థాన్ ఔట్!

యూఎస్, వెస్టిండీస్ వేదికగా టీ20 ప్రపంచకప్ 2024 రసవత్తరంగా సాగుతోంది. ఐపీఎల్ 2024లో మాదిరి భారీ స్కోర్లు నమోదవకున్నా.. సూపర్ ఓవర్లు, ఉత్కంఠ ఫలితాలతో మెగా టోర్నీ మ్యాచ్‌లు అభిమానులకు మంచి మజాను అందిస్తున్నాయి. ఈ క్రమంలో పసికూన జట్లు ఐసీసీ టాప్ టీమ్స్‌కు షాక్ ఇస్తూ సంచనాలు నమోదు చేస్తున్నాయి. దాంతో కొన్ని టాప్ టీమ్స్ సూపర్ 8కు కూడా చేరకుండానే ఇంటిదారి పట్టే పరిస్థితి నెలకొంది. ఈ జాబితాలో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ కూడా ఉంది.




గ్రూప్–ఏలో భారత్, పాకిస్థాన్, అమెరికా, కెనడా, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. ఆడిన రెండు మ్యాచ్‌లు (ఐర్లాండ్, పాకిస్తాన్) గెలిచిన భారత్ 4 పాయింట్స్‌తో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో కెనడా, అమెరికాలతో భారత్ తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు గెలవడం భారత్‌కు పెద్ద కష్టమేమీ కాదు. టీమిండియా కనీసం ఒకటి గెలిచినా సూపర్ 8కు చేరుతుంది. పాకిస్థాన్, కెనడాపై విజయం సాధించిన అమెరికా.. 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో (భారత్, ఐర్లాండ్) ఒక్కటి గెలిచినా యూఎస్ ఖాతాలో 6 పాయింట్స్ చేరుతాయి. రన్‌రేట్ కూడా 0.626తో మెరుగ్గానే ఉండడంతో సూపర్ 8 చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడి ఓడిన పాకిస్థాన్.. టీ20 ప్రపంచకప్ 2024 గ్రూప్ స్టేజ్‌లో నుంచే నిష్క్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. యూఎస్, భారత్ చేతుల్లో ఓడిన పాక్.. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఐర్లాండ్, కెనడాతో ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు గెలిచినా.. పాక్ ఖాతాలో 4 పాయింట్స్ చేరుతాయి. అదే సమయంలో రన్‌రేట్ కూడా బాగుండాలి. పాక్ సూపర్ 8 చేరాలంటే యూఎస్ తమ చివరి రెండు మ్యాచ్‌లలో ఓడిపోవాలి. ఒక్కటి గెలిచినా.. పాక్ పని ఔట్. పాక్ భవితవ్యం మొత్తం ఇప్పుడు యూఎస్ మీద ఆధారపడి ఉంది. కెనడా ఓ మ్యాచ్‌లో గెలిచి.. మరోదాంట్లో ఓడి మూడో స్థానంలో ఉంది. పాకిస్తాన్, భారత్‌లతో కెనడా ఆడాల్సి ఉంది. రెండు టాప్ టీమ్స్ కాబట్టి కెనడాకు అంత ఈజీ కాదు. ఐదవ స్థానంలో ఉన్న ఐర్లాండ్.. భారత్, కెనడాపై ఓడింది. యూఎస్, పాకిస్తాన్ జట్లతో ఆడాల్సి ఉంది. ఐర్లాండ్ ప్రస్తుత ఫామ్ చూస్తే గెలుపు కష్టమే. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప పాక్ లేదా ఐర్లాండ్ సూపర్ 8కు చేరుకోవు.

# కావాలనే చేశాడు.. మా టీమ్ ఓటమికి ప్రధాన కారణం అతడే: సలీమ్

టీ20 ప్రపంచకప్ 2024లో పాకిస్థాన్ మరో ఓటమిని చవిచూసింది. పసికూన అమెరికాపై ఓడిన పాక్.. తాజాగా టీమిండియా చేతుల్లోనూ పరాభవం ఎదుర్కొంది.

భారత్ నిర్దేశించిన 120 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో పాక్ (113/7) విఫలమైంది. తమ జట్టు ఓటమికి భారత అద్భుతమైన బౌలింగ్‌తో పాటు పాక్ బ్యాటర్ల తప్పిదాలే కారణమని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సలీమ్ మాలిక్ పేర్కొన్నాడు. ఇమాద్ వసీమ్ ఇన్నింగ్స్ గమనిస్తే.. అతడు ఉద్దేశపూర్వకంగానే బంతులు వృథా చేసినట్లు అనిపించిందని ఆరోపించాడు.

పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో మొత్తం 120 బంతుల్లో 59 బంతులు డాట్స్‌లే ఉండడం గమనార్హం. కీలక సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఇమాద్.. 23 బంతులు ఎదుర్కొని కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు. దాంతో ఇమాద్ వల్లే లక్ష్య ఛేదన మరింత సంక్లిష్టంగా మారిందని సలీమ్ మాలిక్ విమర్శించాడు. ‘ఓసారి ఇమాద్ వసీమ్ ఇన్నింగ్స్‌ను గమనించండి. చివర్లో దూకుడుగా ఆడాల్సి ఉన్నా.. ఆడలేదు. బంతులను బాగా వృథా చేశాడు. దీంతో లక్ష్య ఛేదన కష్టంగా మారిపోయింది. ఒకవేళ ఇమాద్ కొన్ని పరుగులు చేసి ఉంటే.. పాక్ గెలిచేందుకు అవకాశం ఉండేది’ అని ఓ టీవీ కార్యక్రమంలో సలీమ్ అన్నాడు.



ఇదే చర్చలో పాల్గొన్న పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది కూడా ఓటమిపై స్పందించాడు. ‘పాక్ డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి వాతావరణం ఉన్నట్లు లేదు. కెప్టెన్ బాబర్ ఆజామ్‌తో ఆటగాళ్లకు సమస్యలు ఉన్నాయేమో. జట్టులోని ప్రతి ఒక్కరికి కెప్టెన్ మద్దతుగా నిలవాలి. జట్టును నాశనం చేయాలన్నా లేదా మంచి టీమ్‌గా మార్చాలన్నా సారథికే సాధ్యం. ఈ టోర్నీ ముగిసిన తర్వాత దీనిపై వివరంగా మాట్లాడతా. ఇప్పుడు మాట్లాడితే నేను షహీన్ అఫ్రిదికి మద్దతుగా మాట్లాడుతున్నా అంటారు. అతడు నా అల్లుడు కాబట్టే.. బంధుప్రీతి చూపానని అనేవారు లేకపోలేదు’ అని అఫ్రిది తెలిపాడు.

# పాకిస్తాన్ ఇక ఇంటికేనా.. ఆ అద్భుతం జరిగితే తప్ప..

ఈసారి ఎలాగైనా వరల్డ్‌కప్ గెలవాలన్న లక్ష్యంతో రంగంలోకి దిగిన పాకిస్తాన్ జట్టు ఆదిలోనే భంగపాటు ఎదురైంది. ఆర్మీ వద్ద ప్రత్యేకంగా శిక్షణ తీసుకొని మరీ సిద్ధమైన ఆ జట్టు..

ఇప్పటివరకూ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఘోర పరాజయాల్ని చవిచూసింది. తొలుత యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో పాక్ ఓడిపోగా.. ఆ తర్వాత జూన్ 9న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 పరుగుల తేడాతో జెండా ఎత్తేసింది. దీంతో.. సూపర్–8లో క్వాలిఫై అయ్యే అవకాశాలు ఆ జట్టుకి సంక్లిష్టంగా మారాయి. అద్భుతం జరిగితే తప్ప.. ఆ జట్టు సూపర్–8లో చోటు దక్కించుకోవడం దాదాపు అసాధ్యమే!

ఆ రెండూ సాధించాలి

ఈ మెగా టోర్నీలో రెండు పరాజయాలతో పాక్ జట్టు పాయింట్ల టేబుల్‌లో నాలుగో స్థానంలో ఉంది. ఇది సూపర్–8లోకి చేరాలంటే.. తదుపరి రెండు మ్యాచ్‌ల్లో తప్పకుండా విజయం సాధించాల్సి ఉంటుంది. ఆ రెండు మ్యాచ్‌లు కెనడా, ఐర్లాండ్‌తో ఉండబోతున్నాయి. ఆ రెండు జట్లపై పాకిస్తాన్ భారీ తేడాతో గెలుపొంది, తన రన్‌రేట్‌ని మెరుగుపరచుకోవాలి. అంతేకాదు.. యూఎస్ఏ జట్టు రూపంలో మరో మెలిక కూడా ఉంది. ప్రస్తుతం నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న ఆ జట్టు.. తదుపరి రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవాలి. అలా కాకుండా యూఎస్ఏ ఒక్క మ్యాచ్ గెలిచినా.. పాక్ జట్టు ఇక ఇంటిదారి పట్టాల్సి ఉంటుంది.





ఇంకో మెలిక

ఒకవేళ యూఎస్ఏ జట్టు రెండు మ్యాచ్‌లు ఓడిపోతే.. సూపర్–8లో పాకిస్తాన్ అర్హత సాధించాలా? లేదా? అనేది నెట్ రన్‌రేట్‌పై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం యూఎస్ఏ రన్‌రేట్ (౦0.626) మెరుగ్గా ఉంది. కానీ.. పాక్ రన్‌రేట్ (–0.150) మాత్రం మైనస్‌లో ఉంది. ఈ లెక్కన.. పాక్ తప్పకుండా తన నెక్ట్స్ మ్యాచ్‌ల్లో మంచి ప్రదర్శన కనబరచాల్సి ఉంటుంది. రెండు జట్లపై భారీ తేడాతో విజయం సాధించక తప్పదు. మరి.. అది సాధ్యమవుతుందా? ఎలా చూసినా.. సూపర్–8లో చేరేందుకు పాకిస్తాన్‌కు చాలా తక్కువ అవకాశాలే ఉన్నాయని చెప్పాలి. మరి.. విధి రాసిన రాత ఎలా ఉందో చూడాలి.

# టీ20 ప్రపంచకప్‌లో మొదటి వికెట్.. టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి టీమ్ ఇదే!

యూఎస్ఏ, వెస్టిండీస్ వేదికలుగా రసవత్తరంగా సాగుతున్న ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ 2024లో మొదటి వికెట్ పడింది.



మెగా టోర్నీ గ్రూప్–బి నుంచి పసికూన ఒమన్ నిష్క్రమించింది. ఆదివారం (జూన్ 9) స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిపోవడంతో.. ఒమన్ అధికారికంగా ప్రపంచకప్ నుంచి వైదొలిగింది. దాంతో మెగా టోర్నీ నుంచి నిష్క్రమించిన మొదటి జట్టుగా ఒమన్ నిలిచింది.

టీ20 ప్రపంచకప్ 2024లో ఇప్పటివరకు ఒమన్ మూడు మ్యాచ్‌లు ఆడగా.. మూడింటిలోనూ ఓడింది. నమీబియా, ఆస్ట్రేలియా, స్కాట్లాండ్‌లపై ఒమన్ ఓడింది. దాంతో ఒమన్ సూపర్–8కు అర్హత సాధించకుండానే ఇంటిదారి పట్టింది. ఇక నామమాత్రమైన చివరి మ్యాచ్ జూన్ 13న ఇంగ్లండ్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచినా, ఓడినా ఒమన్ టోర్నీ నుంచి నిష్క్రమించనుంది. న్యూజీలాండ్, పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంకలు కూడా గ్రూప్ స్టేజ్ దాడటం కష్టంగానే ఉంది.

ఆదివారం ఆంటిగ్వా వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఒమన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. ప్రతిక్ అథవాలే (54) అర్ధ సెంచరీ చేశాడు. లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ 13.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. బ్రాండెన్ మెక్‌ముల్లెన్ (61 నాటౌట్), జార్జ్ మున్సే (41) చెలరేగారు.

# మ్యాచ్ రూపురేఖల్ని మార్చేసిన బుమ్రా

టీ20 వరల్డ్‌కప్ 2024లో భాగంగా పాకిస్తాన్‌తో నిన్న (జూన్ 9) జరిగిన ఉ?త్కంఠ పోరులో టీమిండియా 6 పరుగుల స్వల్ప తేడాతో అద్భుత విజయం సాధించింది. ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో బుమ్రా తన ప్రతాపాన్ని చూపి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన బుమ్రా కేవలం 14 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలకమైన వికెట్లు (బాబర్ ఆజమ్, మొహమ్మద్ రిజ్వాన్, ఇఫ్తికార్ అహ్మద్) తీశాడు. భారత్ విజయావకాశాలు పూర్తిగా అడుగంటిన వేళ బుమ్రా వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ మ్యాచ్ రూపురేఖల్నే మార్చేసింది. ఆ ఓవర్‌లో బుమ్రా కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి ప్రమాదకారిగా కనిపించిన ఇఫ్తికార్ అహ్మద్‌ను ఔట్ చేశాడు. తన మ్యాచ్ విన్నింగ్ పెర్ఫార్మెన్స్ కారణంగా బుమ్రా వరుసగా రెండో మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసి టీమిండియాను గెలిపించాడు. పాక్‌తో మ్యాచ్ విషయానికొస్తే.. 120 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకునే క్రమంలో భారత బౌలర్లు ఆదిలో విఫలమయ్యారు. 4 ఓవర్లలో పాక్ వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసి లక్ష్యంగా దిశగా సాగుతుండింది. ఈ దశలో (ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో) బుమ్రా తన అనుభవాన్నంతా రంగరించి పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌ను ఔట్ చేశాడు. అనంతరం ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో మరోసారి బంతిని అందుకున్న బుమ్రా ఈ సారి అప్పటికే క్రీజ్‌లో సెట్ అయిపోయిన రిజ్వాన్‌ను ఔట్‌ను చేసి భారత శిబిరంలో గెలుపుపై ఆశలకు బీజం పోశాడు. ఈ మధ్యలో హార్దిక్ పాండ్యా (4–0–24–2) రెండు వికెట్లు తీసి మ్యాచ్‌ను రక్తి కట్టించగా.. బుమ్రా 19వ ఓవర్‌లో మరోసారి తన ప్రతాపాన్ని చూపాడు. పాక్ గెలుపు ఖాయమనుకున్న వేళ బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా కీలకమైన ఇఫ్తికార్ వికెట్ తీసి పాక్ చేతుల్లో నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. పాక్ గెలుపుకు చివరి ఓవర్‌లో 18 పరుగులు అవసరం కాగా.. అర్షదీప్ ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు. చివరి ఓవర్ నాలుగు, ఐదు బంతులకు నసీం షా బౌండరీలు బాదినప్పటికీ పాక్ ఓటమి అప్పటికే ఖరారైపోయింది. బుమ్రా ప్రదర్శన కారణంగా ప్రస్తుత ప్రపంచకప్‌లో భారత్ వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించి, సూపర్–8 బెర్త్ ఖరారు చేసుకుంది. టీ20ల్లో భారత్ డిఫెండ్ చేసుకున్న అత్యల్ప స్కోర్ (120), టీ20 వరల్డ్‌కప్ టోర్నీల్లో ఏ జట్టైనా డిఫెండ్ చేసుకున్న అత్యల్ప స్కోర్ ఇదే కావడం విశేషం. పాక్‌పై ఈ మ్యాచ్‌లో గెలుపుతో భారత్ టీ20 వరల్డ్‌కప్ టోర్నీల్లో దాయాదిపై తమ రికార్డును (7–1) మరింత మెరుగుపర్చుకుంది. గతేడాది చివర్లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనూ బుమ్రా పాక్‌పై ఇలాంటి మ్యాచ్ విన్నింగ్స్ పెర్ఫార్మెన్సే (2/19) కనబర్చి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు.



స్వల్ప లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకునే క్రమంలో బుమ్రాతో పాటు హార్దిక్ చూపిన పట్టుదలకు క్రికెట్ ప్రపంచం మొత్తం జేజేలు పలుకుతుంది. గెలుపు సునాయాసమనుకున్న మ్యాచ్‌లో ఓడటంతో పాక్ ఆటగాళ్లు, అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు. పాక్‌పై గెలుపు అనంతరం న్యూయార్క్ మైదానంలో భారత అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. పాక్ పేసర్లు చెలరేగడంతో 19 ఓవర్లలో 119 పరుగులకు చాపచుట్టేసింది. అనంతరం భారత పేసర్లు సైతం విజృంభించి పాక్‌కు సాధ్యమైంది తమకెందుకు సాధ్యం కాదన్న రీతిలో ప్రతిఘటించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించారు. భారత బౌలర్ల దెబ్బకు పాక్ నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసినప్పటికీ లక్ష్యానికి 7 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఆ జట్టు చేతిలో ఇంకా 3 వికెట్లు ఉన్నాయి.

బుమ్రా, హార్దిక్‌తో పాటు సిరాజ్ (4–0–19–0), అర్షదీప్ (4–0–31–1), అక్షర్ (2–0–11–1) కూడా రాణించారు. పాక్ ఇన్నింగ్స్‌లో రిజ్వాన్ (31) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకుముందు పంత్ (42) రాణించడంతో భారత్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. పాక్ బౌలర్లలో నసీం షా, హరీస్ రౌఫ్ తలో 3 వికెట్లు, మొహమ్మద్ ఆమిర్ 2, షాహిన్ అఫ్రిది ఓ వికెట్ పడగొట్టారు. ఈ ఓటమితో ప్రస్తుత ప్రపంచకప్‌లో పాక్ సూపర్–8 అవకాశాలు దాదాపుగా గల్లంతైనట్లే.

# మరీ ఇంత నిర్లక్ష్యమా.. భారత బ్యాటర్లపై గవాస్కర్ ఆగ్రహం!

టీ20 ప్రపంచకప్ 2024లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది. పసికూన ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించిన రోహిత్ సేన..

చిరకాల ప్రత్యర్థి పాక్‌పై మాత్రం తృటిలో ఓటమి నుంచి బయటపడింది. బౌలర్లకు సహకరించే న్యూయార్క్ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 19 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో పాక్ 113/7 స్కోరుకే పరిమితమైంది. భారత్ విజయం సాధించినప్పటికీ.. బ్యాటర్ల బ్యాటింగ్ తీరు అందరినీ నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. మరీ ఇంత నిర్లక్ష్యంగా ఆడుతారా? అని మండిపడ్డాడు.




‘పాకిస్థాన్‌పై భారత బ్యాటర్ల ప్రదర్శన నన్ను తీవ్ర నిరాశకు గురి చేసింది. షాట్ల ఎంపికలో చాలా నిర్లక్ష్యం వహించారు. మ్యాచ్‌ను మనోళ్లు తేలిగ్గా తీసుకున్నట్లు అనిపించింది. ప్రతి బంతిని సులువుగా కొట్టేస్తామన్న అహంభావంతో ఆడారు. ఇన్నింగ్స్ తొలి బంతి నుంచే దూకుడుగా ఆడేద్దామని అనుకున్నట్లుంది. ఇది ఐర్లాండ్ బౌలింగ్ ఎటాక్ కాదు. ఏదో చిన్న టీమ్ బౌలింగ్ చేసినట్లు భారత బ్యాటర్లు భావించారు. ఇక్కడ ఐర్లాండ్ జట్టును అగౌరవపరచాలని నేను అనలేదు. పాకిస్తాన్ వంటి అనుభవం కలిగిన బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కొనేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఆడాలి. ఇంకా ఓ ఓవర్ మిగిలి ఉండగానే.. భారత్ ఆలౌట్ కావడం బాధపెట్టే అంశం. చివరి ఓవర్లో మరో 5–6 పరుగులు చేస్తే.. ప్రత్యర్థిపై ఇంకా ఒత్తిడి పెరిగేది’ అని సునీల్ గవాస్కర్ అన్నాడు.

# ‘బెస్ట్ ఫీల్డర్’ మెడల్ ప్రదానం.. భావోద్వేగానికి గురైన రవిశాస్త్రి

ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచ కప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. స్వల్ప లక్ష్యం ఉంచినా పాక్‌ను కట్టడి చేసి టీమ్‌ఇండియా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమ ఫీల్డింగ్ ప్రమాణాలను పాటించిన ఆటగాడికి భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి ‘బెస్ట్ ఫీల్డర్’ మెడల్‌ను అందించాడు.



దీన్ని ఏ ప్లేయర్ సొంతం చేసుకున్నాడనేది ఫీల్డింగ్ కోచ్ దిలీప్ వెల్లడించాడు. పంత్, సూర్యకుమార్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ ఈ మెడల్ కోసం పోటీ పడ్డారని తెలిపాడు. అయితే, బ్యాటింగ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రిషభ్ పంత్.. ఫీల్డింగ్‌లోనూ మూడు క్యాచ్‌లు పట్టాడు. కీపర్‌గా స్టంప్స్ వెనుక చురుగ్గా ఉన్నాడు. దీంతో పంత్‌కే ఈ మెడల్ వరించింది. రిషభ్‌కు మెడల్‌ను అందజేస్తూ రవిశాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

“మాట్లాడేముందు పంత్‌ను హగ్ చేసుకుంటా. అతడిని వరల్డ్ కప్‌లో చూడటం చాలా బాగుంది. అద్భుతంగా ఆడుతున్నాడు. పంత్ రోడ్డు ప్రమాదం గురించి తెలియగానే కన్నీళ్లు వచ్చేశాయి. ఆ పరిస్థితుల్లో అతడిని ఆసుపత్రిలో చూస్తాననుకోలేదు. కోలుకుని వచ్చి.. ఇలాంటి భారీ మ్యాచుల్లో సత్తా చాటడం ప్రశంసనీయం. అందుకే హృదయపూర్వక అభినందనలు చెబుతున్నా. పంత్ బ్యాటింగ్ గురించి అందరికీ తెలిసిందే. కానీ, వికెట్ కీపింగ్ చేయడం చాలా కష్టం. శస్త్రచికిత్స తర్వాత మైదానంలోకి దిగి చురుగ్గా కదలడం అద్భుతమే. అంతర్జాతీయంగా కోట్ల మందికి స్ఫూర్తిగా నిలిచావు. మృత్యువు అంచుల్లోకి వెళ్లి వచ్చిన పంత్.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మున్ముందు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా” అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించడంపై క్రికెట్ దిగ్గజం సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. కుటుంబంతో కలిసి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. “భారత్ – పాకిస్థాన్.. కొత్త ఖండం.. అదే ఫలితం. టీ20 బ్యాటర్ల ఫార్మాట్. కానీ, న్యూయార్క్‌లో బౌలర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ గెలవడం అభినందనీయం. అమెరికాలో ఇలాంటి మ్యాచ్‌లు జరగడం అద్భుతం” అని సచిన్ పోస్టు చేశాడు.

# ఇండియా విన్.. వెక్కి వెక్కి ఏడ్చిన పాకిస్థాన్ క్రికెటర్.

పాకిస్థాన్‌తో జరిగిన టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఇండియా అద్భుత విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే చివరి ఓవర్‌కు గెలుపు కోసం పాకిస్థాన్ పోరాడింది.




ఆఖరిలో పాక్ బ్యాటర్ నసీమ్ షా .. తన సత్తా చాటినా.. ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. చివరి ఓవర్‌లో 18 పరుగులు అవసరం కాగా, నసీమ్ షా రెండు బౌండరీలు కొట్టి కొంత జలక్ ఇచ్చాడు. కానీ టార్గెట్‌ను అందుకోలేకపోయారు. 4 బంతుల్లో 10 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచిన నసీమ్ షా.. ఓడిన బాధలో ఏడ్చేశాడు. నసీమ్ తన దుఖాన్ని ఆపుకోలేకపోయాడు. వెక్కి వెక్కి ఏడ్చేశాడు. ఇండియన్ కెప్టెన్ రోహిత్ శర్మ అతన్ని ఓదార్చే ప్రయత్నం చేశాడు. మ్యాచ్ ముగియగానే.. పాక్ క్రికెటర్ ఏడుస్తూనే మైదానం బయటకు వెళ్లాడు. తోటి క్రికెటర్ షాహీన్ అఫ్రిది కూడా నసీమ్‌ను ఓదార్చే ప్రయత్నం చేశాడు. నసీమ్ ఏడుస్తున్న ఫోటో, వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

లో స్కోరింగ్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా కేవలం 119 రన్స్ మాత్రమే చేసింది. స్వల్ప లక్ష్యంతో ఛేజింగ్‌కు దిగిన పాకిస్థాన్ 113 రన్స్ మాత్రమే చేసి ఆరు పరుగుల తేడాతో ఓటమిపాలైంది. పాక్ జట్టు బౌలింగ్‌లో ఇరగదీసినా.. ఆ జట్టు బ్యాటర్లు స్వల్ప స్కోర్‌ను చేధించడంలో విఫలం అయ్యారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**